



జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఫరూక్

నెల్లూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా అభివృద్ధికి సంబంధించిన నిర్ణయాలలో ఇన్‌చార్జి మంత్రి కీలకంగా వ్యవహరించనున్నారు. ఇక జిల్లాకు చెందిన రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ కాకినాడకు, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిత ప్రకాశం జిల్లాకు ఇన్‌చార్జి మంత్రులుగా నియమితులయ్యారు.

ఎస్ఐ కరీముల్లా సస్పెన్షన్

- వెంకటాచలం పీఎస్‌లో బంగారం మాయం
- చర్యలు తీసుకున్న ఐజీ త్రిపాఠి
- మరికొందరిపై కూడా వేటు?

6



మున్సిపాలిటీకే టెండర్!

అధికారం చేతిలో ఉంది. ఏం చేసినా అడిగేవారు లేదనుకున్నారో ఏమో కావలిలో వైసీపీకి చెందిన ఓ నాయకుడు మున్సిపాలిటీకే టెండరు వేశాడు. గడిచిన ఐదేళ్లలో కూరగాయలు, పండ్ల మార్కెట్ సెస్ వసూలు టెండర్లను బినామీల పేరుతో దక్కించుకున్నాడు. వసూళ్లయిన సొమ్మును పురపాలక సంఘానికి చెల్లించకుండా ఎగనామం పెట్టాడు. ఇప్పుడు ఇది బయట పడటంతో మున్సిపల్ యంత్రాంగం ఆయనపై చర్యలకు ఉపక్రమించింది. అవసరమైతే పోలీస్ కేసు పెట్టేందుకూ సిద్ధమవుతోంది.

6

మండలం	జలదంకి	విడవలూరు	అల్లూరు	కావలి	బోగోలు	కొడవలూరు	సంగం	కందుకూరు	బుచ్చి	ఉలవపాడు	అనంతసాగరం	దగదర్తి	చేజర్ల	కలిగిరి	వెంకటాచలం	టీపీగూడూరు	గుడ్లూరు	కోవూరు	ఇందుకూరుపేట	నెల్లూరు అర్బన్
వర్షపాతం	173.0	153.0	149.04	139.6	131.4	127.4	125.4	121.2	115.2	113.8	111.4	106.4	105.6	102.6	98.6	97.4	97.4	96.6	95.8	91.6




ముసురుతో ముంచెత్తింది!

మోస్తరు నుంచి భారీ వర్షం ● నేడు కూడా వాన... జిల్లాకు రెడ్‌అలెర్ట్

అప్రమత్తమైన అధికార యంత్రాంగం ● విద్యాసంస్థలకు సెలవు కొనసాగింపు

నెల్లూరు (హరనాథపురం) (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పడీన ప్రభావంతో జిల్లావ్యా ప్తంగా మంగళవారం కూడా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మంగళవారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జిల్లాలో సగటు వర్షపాతం 94.8 మి.మీగా నమోదైంది. ఎడతెరిపి లేని వర్షంతో పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయం అయ్యాయి. చెట్లు విరిగి పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నెల్లూరు, కావలి, కోవూరు, కందుకూరు నియోజకవర్గాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. నెల్లూరులోని 53వ డివిజన్‌లో ఉన్న గాంధీ గిరిజన కాలనీ, వెంకటేశ్వరపురంలో వర్షపు నీరు చేరింది. ఆర్టీసీ కాలనీని వర్షపునీరు చుట్టేసింది. నెల్లూరు ట్రంకురోడ్డుపై మురుగు ప్రవహించింది. రైల్వే అండర్ బ్రిడ్జీలలో నీరు చేరటంతో కార్పొరేషన్ అధికారులు మోటార్ల సహాయంతో తోడిస్తున్నారు. జిల్లాలోని లోతట్టు ప్రాంతాల్లో ఉన్న 100 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బుధవారం కూడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించగా, జిల్లాకు రెడ్ అలెర్టును ప్రకటించింది. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. నెల్లూరు చెరువు కలుజును, పెన్నా పొర్లు కట్ట ప్రాంతాన్ని, పెన్నా బ్రిడ్జి ప్రాంతాన్ని కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. బోడిగాడితోట వద్ద పెన్నా నదిలో పడిన గండిని వారు పరిశీలించారు. రానున్న 48 గంటలపాటు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పిలుపునిచ్చారు బుధవారం కూడా పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు కలెక్టర్ సెలవు ప్రకటించారు.

నెల్లూరు : తల్పగిరి కాలనీలో ఇళ్ల మధ్య నీరు





కావలి : పేపాలవారిపాళెంలో విరిగిన విద్యుత్ స్తంభం



అల్లూరు : తుమ్మలపెంట తీరంలో పోలీసుల పహారా

● 180 ఎకరాల్లో వరి పైరు మునక

నెల్లూరు (వ్యవసాయం) : రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వరి పైరు, నారుమడులు నీటిలో నానుతున్నాయి. దాదాపు 180 ఎకరాల్లో కోత దశకు చేరుకున్న వరి పైరు నీటమునిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా. అదేవిధంగా దాదాపు 175 ఎకరాల నారుమడులు నీటమునిగినట్లు చెబుతున్నారు. అయితే, ఇది కేవలం ప్రాథమిక అంచనా మాత్రమే. ఇంకా చాలా పొలాలు నీటమునిగాయని వివరాలు పూర్తిస్థాయిలో రావాల్సి ఉందని తెలుస్తోంది. పొలాల్లోని నీటిని బయటి ప్రాంతాలకు పంపేందుకు రైతులు కాలువలు ఏర్పాటు చేసుకుంటున్నారు. కావలి సబ్ డివిజన్ పరిధిలో దాదాపు 7.5 ఎకరాల్లో పూలు, కూరగాయల పంటలు దెబ్బతిన్నట్లు ఉద్యాన శాఖ అధికారుల అంచనా.

● 'సోమశిల'కు పెరిగిన ఇన్‌ఫ్లో

అనంతసాగరం/సంగం (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం 9,776 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. జలాశయంలో 52.223 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 50, కండలేరుకు 6 వేలు, ఉత్తర కాలువకు 40 క్యూసెక్కులు చొప్పున నీటిని సరఫరా చేస్తున్నారు. బుధవారం ఉదయానికి వరద ప్రవాహం పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే సంగం బ్యారేజీకి సుమారు 2,950 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో బ్యారేజి వద్ద ఉన్న నీటిమట్టం 8.2 అడుగులకు చేరింది. సోమశిల జలాశయానికి నీటి ప్రవాహం పెరుగుతుండటంతో బ్యారేజీలో 12 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు.

పబ్లిక్ నోటీసు

యిందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా SPSR నెల్లూరుజిల్లా, అనంతసాగరం మండలం, కొత్తపల్లి గ్రామ వాస్తవ్యులు శ్రీ చిలకా చంద్రమౌళిరెడ్డి తండ్రి మస్తాన్‌రెడ్డి మరియు శ్రీమతి చిలకా పార్వతి భర్త చంద్రమౌళిరెడ్డి అనువారలు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి తమ స్వార్జితమైనదని వీటిని తాము ఆత్మకూరు సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయము నందు రిజిష్టరు కాబడిన నెం.603/2013, 604/2013, 683/2012 మరియు 684/2012 విక్రయ పత్రముల ద్వారా పొందియున్నామని, వీరిలో చిలకా చంద్రమౌళిరెడ్డి గారు బొమ్మవరం గ్రామ సర్వే నెం.15రులోని ఎ.2.15 1/2 సెంట్ల భూమిని లేక్‌వ్యూ కాలని, పొదలకూరు రోడ్డు, నెల్లూరుసిటీ వాస్తవ్యులయిన శ్రీమతి వంగవరుగు శ్రీలక్ష్మీ సుప్రజ భర్త బొమ్మ నవీన్‌కుమార్‌గారి పేరున నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయం డాక్యుమెంట్ నెం.4663/2014రు ద్వారా విక్రయించి ప్రతిఫలం పొందియున్నారని మరియు శ్రీమతి చిలకా పార్వతి భర్త చిలకా చంద్రమౌళిరెడ్డి గారు సర్వే నెం.15 లోని ఎ.2.86 1/2 సెంట్ల భూమి, సర్వే నెం.16రులోని ఎ2.07 సెంట్ల భూమిని రవీంద్రనగర్, కొండాయపాళెం గేటు, నెల్లూరుసిటీ వాస్తవ్యులు వంగవరుగు సుధాకర్‌రెడ్డి తండ్రి మాలకొండారెడ్డి గారి పేరున స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయం డాక్యుమెంటు నెం.4664/2014రు ద్వారా విక్రయించి ప్రతిఫలం పొందియున్నారని మరియు చిలకా చంద్రమౌళిరెడ్డి గారు శ్రీమతి వంగవరుగు పద్మావతి భర్త వంగవరుగు సుధాకర్‌రెడ్డి గారి వద్ద నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయం నందు రిజిష్టరు కాబడిన డాక్యుమెంటు నెం.4662/2014రు ద్వారా బొమ్మవరం గ్రామ సర్వే నెం.14రు లోని ఎ.12.65 సెంట్ల భూమిని చూపుడు ఆడుమానం పెట్టి రూ.25,00,000/-లు ఆడుమానం అప్పు పొందియున్నారని, ప్రస్తుతం పై ఐదుగురు సమిష్టిగా పరస్పర అవగాహన ద్వారా ఏలాంటి ఒత్తిడులకు లోను కాకుండా మనస్ఫూర్తిగా క్రింది షెడ్యూలు దాఖలా మొత్తము ఆస్తిని విక్రయించదలచగా నా కక్షిదారులు కొనుగోలు చేయదలచి వారితో సముచితమైన విక్రయ ప్రతిఫలం చెల్లించుటకు ఒప్పుకొని విక్రయ అగ్రిమెంట్ చేసికొనియున్నారు.

ఇట్లుండుటలో పై అమ్మకందారులు షెడ్యూలు దాఖలా స్థిరాస్తికి సంబంధించిన ఒరిజినల్ లింకు డాక్యుమెంట్లు కనపడుట లేదని మరియు ఒరిజినల్ డాక్యుమెంట్ల ద్వారా వారు ఇతరులెవ్వరితోను ఏ విధమైన లావాదేవీలు షెడ్యూలు ఆస్తిపై చేసియుండట లేదని నా కక్షిదారులను నమ్మబలికినారు. కనుక ఇందు విషయముల పై ఏ వ్యక్తి వ్యక్తులకు, కంపెని లేదా కార్పొరేషన్‌లకు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై లేదా అందులో భాగము పై మార్పిడి, అమ్మకము, దానము, తనఖా, నమ్మిక ద్వారా, పిత్రార్జితము, శాపన పూర్వకముగా గాని, గుత్త ద్వారా గాని, సాధనము ద్వారా గాని, యాజమెంటు ద్వారా గాని మరియే ఇతర రకములైన హక్కులు గాని, ఇతర ఏ విధమైన లాభమొనర్చు ఆసక్తులు ఉన్న యెడల అటువంటి వారు వారి వారి ఆసక్తులను, అభ్యంతరములను ఈ నోటీసు ప్రచురితమైన వారము దినము లోపుగా ఈ క్రింది అడ్రస్సునకు తెలియజేయగలరు. లేనిచో ఈ విక్రయమునకు సంబంధించి ఎవ్వరికి ఏలాంటి అభ్యంతరములు లేవని భావించి నా కక్షిదారులు విక్రయమును పూర్తి చేసికొనదరు. తదుపరి ఎవ్వరికైన ఏలాంటి హక్కులు, ఆసక్తులు ఉన్ననూ వారు సదరు హక్కులను, ఆసక్తులను స్వయముగా బుద్ధిపూర్వకముగా వదలుకొన్నట్లుగా తలంపబడును. మరియు అలాంటి విషయములు నా కక్షిదారులను బద్ధగించనేరవు.

ఆస్తి షెడ్యూలు

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా, రిజిస్ట్రేషన్, ఆత్మకూరు సబ్ డి.రి. అనంతసాగరం మండలం, బొమ్మవరం గ్రామ పంచాయతీలో చేరిన బొమ్మవరం గ్రామ పొలం, కోరు మెట్ల సర్వే నెం.14 విస్తీర్ణం ఎ.12-65 సెంట్లు, సర్వే నెం.15 విస్తీర్ణం ఎ.2-15 1/2 సెంట్లు, సర్వే నెం.15 విస్తీర్ణం ఎ.2-86 1/2 సెంట్లు, సర్వే నెం.16 విస్తీర్ణం ఎ.2.07 సెంట్లు. వెరశి మొత్తం ఎ.19-74 సెంట్లు లేక 7.994 హెక్టార్లు భూమికి హద్దులు: తూర్పు: పొరెస్టు భూమి, దక్షిణం మరియు ఉత్తరం: ప్రభుత్వ భూమి, పడమర: శానంపూడి నాగయ్య భూమి పై హద్దుల మధ్య గల ఏక ప్రదేశం యావత్తు యాజమెంటు హక్కులతోటి.

వింజమూరు
15-10-2024

టి.విజయభాస్కర్‌రెడ్డి
న్యాయవాది, వింజమూరు గ్రామం, మండలం
వింజమూరు-524228, నెల్లూరుజిల్లా. సెల్:94410 60938

సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా

వర్షాల కారణంగానే..

నెల్లూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రభుత్వం తాత్కాలికంగా వాయిదా వేసింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఎన్నికల నిర్వహణకు బుధవారం నోటిఫికేషన్ వెలువడాల్సి ఉంది. అయితే, రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో అధికార యంత్రాంగం సహాయక చర్యల్లో నిమగ్నమై ఉంది. ఇప్పుడు ఎన్నికల ప్రక్రియను ప్రారంభించడం కష్టమని పలు జిల్లాల నుంచి ప్రభుత్వానికి నివేదికలు వెళ్లాయి. దీంతో నోటిఫికేషన్‌ను తాత్కాలికంగా వాయిదా వేయాలని జలవనరుల శాఖ నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి.

ప్రైవేటు మద్యం.. నేటి నుంచే!

దుకాణాల ఏర్పాటుకు తాత్కాలిక లైసెన్సులు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : ఎక్సైజ్ డీసీ

నెల్లూరు (క్రైం) అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం పాలసీ బుధవారం నుంచి అమలులోకి రానుంది. ఇప్పటి వరకు ప్రజలకు నరకం చూపించిన ప్రభుత్వ మద్యం దుకాణాలు మంగళవారం మూతపడ్డాయి. ఇక నుంచి ప్రైవేట్ మద్యం దుకాణాలు రానున్నాయి. జిల్లావ్యాప్తంగా 182 వైన్ షాపులను లాటరీ విధానంలో దక్కించుకున్న లైసెన్స్ దారులు మంగళవారం ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకుని ధ్రువీకరణ పత్రాలు పొందారు. అక్కడి నుంచి నేరుగా నెల్లూరు రూరల్ మండలంలోని దేవరపాళెం వద్ద ఉన్న మద్యం డిపోకు చేరుకొని రిటైల్‌కోడ్‌ను పొందారు. నెల రోజుల్లోపు వ్యాపారులు బ్యాంక్ గ్యారెంటీ, కౌంటర్ పార్ట్ అగ్రిమెంట్, షాపునకు సంబంధించిన లీజు అగ్రిమెంట్, బ్లూ ప్రింట్‌లు సమర్పించాల్సి ఉంది. ఇవన్నీ సమర్పించాక ఎక్సైజ్ అధికారులు పర్మినెంట్ లైసెన్సు మంజూరు చేస్తారు.

● నూతన మద్యం పాలసీ

జిల్లావ్యాప్తంగా 193 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. ప్రభుత్వం నూతన మద్యం పాలసీని ప్రవేశ పెట్టడంతో ఇవి మూతపడ్డాయి. ఇకనుంచి ప్రైవేట్ వైన్స్ షాపులు తెరుచుకోనున్నాయి. ప్రభుత్వ దుకాణాల్లోనే లిక్కర్, కంప్యూటర్లు, సీపీవోలు, ఫర్నీచర్, రికార్డులను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకొని మద్యం డిపోకి తరలించనున్నారు. వీటిని తరలించే ప్రక్రియ పూర్తయ్యేంత వరకు సిబ్బందిని విధుల్లోనే ఉంచాలని, అప్పటివరకు జీత భత్యాలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది.



● సిండికేట్ల మధ్యస్థాల్లో రసాభాస

ఈసారి సిండికేట్ల సామ్రాజ్యం ప్రైవేట్ వైన్ షాపుల్లో పాగా వేసింది. గతంలో సిండికేట్ అంటే నలుగురి నుంచి ఆరుగురి వరకే ఉండేవారు. అయితే ఈసారి వైన్ షాపులు దక్కించుకునేందుకు అధికార పార్టీ నేతలు పదుల సంఖ్యలో సిండికేట్‌గా మారారు. దుకాణాల కోసం వందలాది దరఖాస్తులు చేశారు. అయితే మూడు నుంచి నాలుగు, సిండికేట్లను మాత్రమే షాపులు వరించాయి. ఒకటి, రెండు సిండికేట్లకు మాత్రం ఆరు నుంచి ఎనిమిది షాపులు దక్కాయి. దీంతో మంగళవారం సిండికేట్ సభ్యులు సమావేశాలు ఏర్పాటు చేసుకొని తక్కువగా వచ్చిన షాపుల్లో ఎవరిని భాగస్వామ్యం చేయాలి.. దరఖాస్తు చేసుకున్న సొమ్మును ఎవరికి ఇవ్వాలి..?.అనే విషయాలపై చర్చించారు. ఈ చర్చలో పలువురు అసహనం వ్యక్తం చేయడంతో రసాభాసగా ముగిసినట్లు సమాచారం.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రభుత్వ మద్యం దుకాణాలు పూర్తిగా రద్దయ్యాయి. ప్రైవేట్ వైన్‌షాపులు పొందిన వారు బుధవారం నుంచి విక్రయాలు జరుపుకోవచ్చు. అయితే వారు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు.

\- శ్రీనివాసరావు, ఎక్సైజ్ డీసీ

న్యూస్ బాక్స్

ఎస్ఐ కరీముల్లా సస్పెన్షన్

- వెంకటాచలం పీఎస్‌లో బంగారం మాయం
- నివేదిక ఇచ్చిన సీఐ, డీఎస్పీ
- చర్యలు తీసుకున్న ఐజీ త్రిపాఠి

నెల్లూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గతంలో జిల్లాలో పనిచేసి ప్రస్తుతం గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న వివాదాస్పద ఎస్ఐ కరీముల్లా సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ మేరకు గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట్ త్రిపాఠి మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో వెంకటాచలం ఎస్ఐగా కరీముల్లా పనిచేస్తున్న సమయంలో ఓ కేసుకు సంబంధించి సుమారు 800 గ్రాముల బంగారాన్ని సీజ్ చేశారు. అయితే ఈ బంగారం పోలీసు స్టేషన్ నుంచి మాయమైంది. ఎస్సై ఆధీనంలో ఉండాల్సిన బంగారం మాయమైనట్లు ఏడాది క్రితమే వెలుగులోకి వచ్చింది. కానీ నాడు పోలీసు ఉన్నతాధికారులు కూడా ఈ విషయాన్ని రాజకీయ ఒత్తిళ్లతో పట్టించుకోలేదు. ఇప్పుడు ప్రభుత్వం మారాక వెంకటాచలం స్టేషన్‌కు కొత్త సీఐగా సుబ్బారావు బాధ్యతలు తీసుకున్నారు. చార్జ్ తీసుకున్న సందర్భంగా అన్ని కేసులకు సంబంధించిన ప్రాపర్టీలను ఆయన పరిశీలించుకున్నారు. కానీ బంగారం మాత్రం స్టేషన్‌లో లేకపోవడంతో వెంటనే ఈ విషయాన్ని నివేదిక రూపంలో ఎస్పీ జీ కృష్ణకాంత్‌కు తెలియజేశారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపేందుకు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస్‌ను విచారణాధికారిగా నియమించారు. ఆయన కూడా వెంకటాచలం స్టేషన్‌లో బంగారం మాయమైనట్లు నిర్ధారించి, అందుకు అప్పటి ఎస్సైను బాధ్యుడిగా నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. ఈ నివేదికలను జిల్లా ఎస్పీ గుంటూరు రేంజ్ ఐజీకు పంపారు. వీటిని పరిశీలించిన ఐజీ.. ఎస్సై కరీముల్లాను సస్పెండ్ చేశారు. అయితే ఎప్పుడో రెండేళ్ల క్రితం బంగారం మాయమైతే ఇన్నాళ్లూ అక్కడ పనిచేసిన పోలీసు అధికారులు ఎందుకు ఈ విషయాన్ని పట్టించుకోలేదన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఈ వ్యవహారంలో గతంలో పనిచేసిన ఓ రైటర్ పాత్ర కూడా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎస్సై కరీముల్లాను సస్పెండ్ చేసిన నేపథ్యంలో మిగిలిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారన్నది చర్చనీయాంశంగా మారింది. కాగా ఈ వ్యవహారంపై ఎస్పీ జీ కృష్ణకాంత్‌ను వివరణ కోరగా ఎస్సైను సస్పెండ్ చేసిన మాట వాస్తవమేనని చెప్పారు.



రూ. 10 నాణేల సంచిని విడుదల చేస్తున్న డీజీఎం జీఎస్ మూర్తి

రూ.10 నాణేలు చెల్లుతాయి

- కెనరా బ్యాంకులో పంపిణీ

నెల్లూరు హరనాథపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ విపణి లో పది రూపాయాల నాణేలు చెల్లుబాటవుతాయని తెలియచేస్తూ నగరం లోని కెనరా బ్యాంకు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్ ఆధ్వర్యంలో అధికారులు రూ.10 నాణేల పంపిణీని చేపట్టారు. నెల్లూరులోని ఆ బ్యాంకు రీజినల్ కార్యాలయం ఎదుట మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. వినియోగదారులు ఎక్కువ సంఖ్యలో ఈ నాణేలను తీసుకున్నారు. ఈ సందర్భంగా బ్యాంకు తిరుపతి సర్కిల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ జీఎస్ మూర్తి మాట్లాడుతూ ప్రజలకు రూ.10 నాణేలపై అవగాహన కల్పిస్తున్నామ న్నారు. ఈ సందర్భంగా మొబైల్ కరెన్సీ వ్యాన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రీజియన్ ఏజీఎం ఏ నాగరాజు రూ. 10 నాణేలపై అవగాహన కల్పిస్తూ పోస్టర్లను విడుదల చేశారు. బ్యాంకు డివిజనల్ మేనేజర్ ఎస్ మునిశేఖర్, మేనేజర్ స్మృతి, కరెన్సీ చెస్ట్ సీనియర్ మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.




గుట్టలుగా పడి ఉన్న సర్వే రాళ్లు

నూకవరం, బడేవారిపాలెం, పోలినేని పాలెం, కాకుటూరు, నలదలపూరు, కళవల్ల, కూనిపాలెం, పోకూరు తదితర గ్రామాల్లో రోడ్ల వెంట జగనన్న భూరక్ష పథకం సర్వేహద్దు రాళ్ల గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. అప్పటి వైసీపీ ప్రభుత్వం రీసర్వే చేపట్టి హద్దురాళ్ల ఏర్పాటు చేయాలని రీ సర్వే చేపట్టింది. ఈ సర్వేను అధికారులు తప్పులతడకగా చేపట్టడంతో అది ఆదిలోనే నిలిచిపోయింది. ప్రభుత్వం సరఫరా చేసిన సర్వేహద్దు రాళ్లను పొలాల్లో పాతేందుకు కూడా రైతులు అభ్యంతరాలు చెప్పారు. లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - వలేటివారిపాలెం

స్ఫూర్తి

మామంచి తిరుమలమ్మపాళెం!

- సారా, కల్లు అమ్మకాల నిషేధం
- నలభై ఏళ్ల క్రితమే గ్రామస్థుల కట్టుబాటు
- గ్రామంలో 96 శాతం మంది అక్షరాస్యులే




తిరుమలమ్మపాళెం గ్రామ వ్యూ

వెంకటాచలం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : తిరుమలమ్మపాళెం.. మండల కేంద్రం వెంకటాచలానికి 23 కి.మీ దూరంలో ఉంటుం ది. చుట్టూ కండలేరు క్రీకు కాలువల మధ్యలో ఈ గ్రామం ఓ దీవిలా ఉంటుంది. 96 శాతం గ్రామస్థులు అక్షరాస్యులుగా ఉండటం ఈ గ్రామం ప్రత్యేకత. అందుకే అందరూ ఈ గ్రామాన్ని చదువులమ్మపాళెంగా పిలుస్తుంటారు. అంతేకాదండోయ్.. గ్రామంలో ఉద్యోగులు కూడా అధిక సంఖ్యలోనే ఉన్నారు. 260 కుటుంబాలున్న దళితవాడలో దాదాపు ఇంటికో ఉద్యోగి ఉండటం విశేషం.

మరో ప్రత్యేకత

సుమారు 40 ఏళ్ల క్రితం అప్పటి గ్రామపెద్దలు గ్రామంలో కల్లు, సారా వంటి మత్తు పదార్థాలు విక్రయించరాదని కట్టుబాటు పెట్టుకున్నారు. అప్పట్లో కల్లు, సారా వల్ల గ్రామస్థులు ఎక్కువ మంది ఇబ్బందులు పడడంతో వారు ఈ కట్టుబాటును విధించుకున్నారు. గ్రామంలో సారా కాసి బయట ప్రాంతాల్లో విక్రయించడం వల్ల పోలీసులు నిత్యం గ్రామానికి చేరుకుని ఇబ్బందులకు గురి చేసేవారు. ఓ వైపు సారా వల్ల కుటుం బాలు ఆర్థికంగా విచ్ఛినం కావడం, మరోవైపు పోలీసుల ఇబ్బందులను తట్టుకోలేక అప్పట్లో గ్రామ పెద్దలంతా సమావేశమై ఏకగ్రీవ తీర్మానం చేసుకున్నారు. నాటి నుంచి ఈ గ్రామం మద్య రహితంగానే ఉంటోంది. సుమారు 2,060 జనాభా కలిగిన ఈ గ్రామంలో ఇప్పటికీ కల్లు, సారా, మద్యం విక్రయాలు లేవు. బెల్టు షాపులు కూడా ఉండవు. ఎవరైనా మద్యం తాగాలంటే పొరుగున ఉన్న వెంకటరెడ్డి పాళెం వెళ్లాల్సిందే. కాలక్రమేణా ఒకరిద్దరూ గ్రామంలో బెల్టుషాపులు ఏర్పాటు చేసినా, గ్రామస్థులంతా ఏకమై అడ్డుకున్నారు. మిగిలిన గ్రామాలకు ఇది స్ఫూర్తివంతంగా నిలుస్తున్నది.



ఐకమత్యం వల్లే సాధ్యం



గ్రామంలో ఐకమత్యం ఉండబట్టే మద్యపాన నిషేధం సాధ్యమైంది. కట్టుబాటును అతిక్రమించి ఎవరైనా విక్రయాలు జరిపితే గ్రామస్థులంతా ఒక్కటై అమ్మకాలను ఆపేస్తారు. గ్రామంలో అక్షరాస్యత పెరగడం కూడా మద్యం అమ్మకాల నిరోధానికి మరో కారణం

- దాన పద్మ, సర్పంచి

మహిళలే కీలకం



గ్రామంలో పురుషులతోపాటు మహిళలు కూడా అధిక సంఖ్యలో అక్షరాస్యులుగా ఉన్నారు. అందువల్ల వారు మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉంటారు. వాటి వల్ల జరిగే అనర్థాల గురించి వారికి బాగా తెలుసు. దీంతో గ్రామంలో కల్లు, మద్యం విక్రయాలను వారు వ్యతిరేకిస్తున్నారు.

- పాముల నందకిషోర్

మద్యం దుకాణం వద్దే వద్దు



ఉదయగిరిలోని అన్నపూర్ణానగర్‌లో నివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని ఆ ప్రాంత వాసులు ఎక్సైజ్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రాంతంలో వైద్యశాల, ఐటీఐ కళాశాల ఉండడంతో విద్యార్థులు, ప్రజలు అధికంగా రాకపోకలు సాగిస్తుంటారన్నారు. ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే వారి ప్రశాంతతకు భంగం కలుగుతుందని తెలిపారు. గతంలో సైతం మద్యం దుకాణం ఏర్పాటును అడ్డుకున్నామని పేర్కొన్నారు. అనంతరం సీఐ లక్ష్మణ్‌స్వామికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలిగించేలా చేయమని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు కంభాల చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్, స్థానికులు మల్లికార్జున, వీరారెడ్డి, మాధవరెడ్డి, వెంగళరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే మా వార్డులో మద్యంషాపునకు అనుమతులు ఇవ్వవద్దంటూ కావలి 33వ వార్డుప్రజలు మంగళవారం మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. స్పందించిన కమిషనర్ ఇంకా ఎవరూ అక్కడ అనుమతుల కోసం తమ వద్దకు రాలేదన్నారు.

- ఉదయగిరి రూరల్/కావలి (ఆంధ్రజ్యోతి)

మద్యం దుకాణాన్ని ఊరికి దూరంగా ఏర్పాటు చేయాలి

- సీపీఎం నాయకుల నిరసన

తోటపల్లిగూడూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నరుకూరు సెంటర్‌లో ఏర్పాటు చేయనున్న మద్యం దుకాణాన్ని ఊరికి దూరంగా మార్చాలని సీపీఎం మండల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం దుకాణం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం సీపీఎం మండల కార్యదర్శి వేగూరు వెంకయ్య మాట్లాడుతూ నరుకూరు సెంటర్‌లో మద్యం దుకాణాల వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. దుకాణానికి ఇరువైపులా దేవాలయాలు ఉన్నాయని, దీంతో భక్తులకు మందుబాబుల వల్ల ఇబ్బందికరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సెంటర్ నుంచి జనవాసాలు లేని దగ్గర ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మారు బోయిన రాజా, కాల్తిరెడ్డి రవణమ్మ, పచ్చ మధు, బండిశౌరి, వివిధ గ్రామాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



నరుకూరులో మద్యం దుకాణం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

వైభవంగా దుర్గాదేవి గ్రామోత్సవాలు



కోదండరామపురంలో గ్రామోత్సవంలో దుర్గాదేవి



మనుబోలులో కాళికాదేవి అలంకరణలో దుర్గాదేవి

మనుబోలు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మనుబోలులో దసరా నవరాత్రుల సందర్భగా వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవిలకు సోమవారం అర్ధరాత్రి పోటాపోటీగా గ్రామోత్సవాలు నిర్వహించారు. ఈనెల 4 నుంచి 14వతేదీ వరకు మనుబోలులో, కోదండరామపురంలో దసరా ఉత్సవాలు నిర్వహించారు. దుర్గాదేవిని వివిధ రూపాలలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరిరోజున దుర్గాదేవిని కాళికాదేవి రూపంలో భారీ గజమాలలు వేసి ప్రత్యేకంగా అలంకరించారు. విద్యుద్దీపాలు, బాణసంచా, మంగళవాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ రెండు చోట్ల గ్రామోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మనుబోలులో అమ్మవారి లడ్డూకు వేలం పాట నిర్వహించగా కాంద్ర బ్రదర్స్ రూ.18 వేలకు, డబ్బుల మాలను పొట్టి నాగేంద్ర ప్రసాద్ రూ.24వేలకు దక్కించుకున్నారు. ఉత్సవాలను తిలకించేందుకు మనుబోలుకు పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. జోరు వర్షమైనా ఆగకుండా నిర్వాహకులు గ్రామోత్సవాలను మంగళవారం ఉదయం వరకు వైభవంగా కొనసాగించారు. గ్రామోత్సవాల అనంతరం కలశాలను మనుబోలు పెద్దచెరువులో నిమజ్జనం చేశారు.

మున్సిపాలిటీకే టెండర్!

- కావలిలో వైసీపీకి చెందిన ఓ నేత నిర్వాకం
- ఐదేళ్లలో సెస్ సొమ్ము రూ.70 లక్షలు స్వాహా
- రికవరీ కోసం బినామీలకు నోటీసులు

కావలి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కావలిలో వైసీపీకి చెందిన ఓ నాయకుడు గడిచిన ఐదేళ్లుగా కూరగాయల, పండ్ల మార్కెట్ సెస్ వసూలు టెండర్లను బినామీల పేరుతో దక్కించుకున్నారు. తొలి ఏడాది కాంట్రాక్టర్ డీఫాల్ట్ అయితే మరుసటి ఏడాది ఆయనకు టెండర్ ఇవ్వకూడదు. అయితే, అధికార పార్టీని అడ్డుపెట్టుకుని అధికారులను మేనేజ్ చేసి సాల్వెన్స్ సర్టిఫికెట్లు కూడా ఇవ్వకుండా రకరకాల పేర్లతో టెండర్లను దక్కించుకున్నారు. 2024-25 సంవత్సరానికి కూడా ఈ ఏడాది మార్చిలో బినామీ పేరుతో టెండర్ చేజిక్కించుకున్నారు. అయితే ఈసారి సాల్వెన్స్ సర్టిఫికెట్ తీసుకుని టెండర్ వేశారు. అయితే, వ్యాపారుల వద్ద సెస్ వసూలు చేసుకుని మున్సిపాలిటీకి చెల్లించకుండా ఎగనామం పెట్టాలనుకున్న ఆయనకు కూటమి ప్రభుత్వంలో ఆస్కారం లేకుండా పోయింది. గడిచిన ఐదేళ్లలో సెస్ వసూలు చేసిన సొమ్ముపై అధికారులు ఆరా తీయగా సుమారు రూ.70 లక్షల వరకు బకాయి ఉన్నట్టు బయట పడింది. ఈ వ్యవహారంపై మరింత లోతుగా విచారించగా బినామీల పేరుతో ఆ వైసీపీ నేతే టెండర్లు దక్కించుకున్నట్టు తేలింది. వెంటనే ఈ ఏడాది టెండర్‌ను రద్దు చేసి రీ టెండర్‌ను పిలిచారు.



మున్సిపల్ కార్యాలయం

అయితే, గడిచిన ఐదేళ్లలో కాంట్రాక్టర్లు దక్కించుకున్న బినామీల చిరుమానాల ప్రకారం వారికి నోటీసులు ఇచ్చారు. అయితే, వారి పేరు మీద వైసీపీ నేతే టెండర్లు దక్కించుకున్నందున ఏం సమాధానం ఇవ్వాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. దీంతో వారందరిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలనే ఆలోచనలో మున్సిపల్ అధికారులు ఉన్నారు.

టెండరుదారులకు నోటీసులు ఇచ్చాం

కూరగాయలు, పండ్ల మార్కెట్ సెస్ వసూలుకు టెండర్లు దక్కించుకుని మున్సిపాలిటీకి డబ్బులు చెల్లించని వారందరికీ నోటీసులు ఇచ్చాం. రిజిస్టర్ పోస్ట్ ద్వారా నోటీసులు ఇచ్చినా వారి నుంచి సమాధానం రాలేదు. దీంతో వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి లీగల్‌గా చర్యలు తీసుకునే ఆలోచనలో ఉన్నాం.

- జీ. శ్రావణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, కావలి

వైభవంగా గంధమహోత్సవం

అనంతసాగరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అనంతసాగరంలో మంగళవారం హజరత్ మహ బూబ్‌సుబానీ గంధమహోత్సవం వైభవంగా జరిగింది. గుంతబజార్, పీర్‌సాహెబ్‌పేట, గుండంవీధి, నడివీధిలో ఉన్న దర్గాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా గంధమహోత్సవ వాహనాలను పూలతో అలంకరించి మేళతాళాలతో గ్రామంలో ఊరేగించి ప్రత్యేక ఫాతెహా అనంతరం భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు.



ప్రత్యేక వాహనాల్లో ఊరేగిస్తున్న గంధం

వెన్నెముకే ఆధారం

అనేక జీవుల శరీరాలకు ఆధారం వెన్నెముక. ప్రత్యేకించి మానవ శరీర ఆకృతిలో వెన్నెముకకు ఎంతో ప్రాధాన్యత ఉంది. అది నిటారుగా ఉంటేనే మనిషి కూడా నిటా రుగా నిలబడ గలుగుతారు. ఈ వెన్నెముకలో ఎలాంటి సమస్య వచ్చినా అది తీవ్ర అనారోగ్యానికి దారితీస్తుంది. అయితే అవగాహన లోపం, అలక్ష్యం కారణంగా ఎంత మంది వెన్నెముక వ్యాధులకు గురవుతున్నారు. ఆధునిక జీవన విధానాలు, అలవాట్ల కారణంగా వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. ఒకప్పుడు 40, 50 ఏళ్ల పైబడ్డ వారికి వచ్చే ఈ వ్యాధి ప్రస్తుతం యువతను సైతం కలవర పెడుతోంది. పెద్దవారిలో ప్రతి 100 మంది రోగులలో ఐదు శాతం మంది తీవ్రమైన వెన్నెముక వ్యాధులతో బాధపడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీరిలో ఎక్కువ మంది మహిళలే కావడం గమనార్హం. నేటి విద్యా విధానంలో పుస్తకాల బరువుతో చిన్నపిల్లలు కూడా వెన్నెముక వ్యాధులతో బాధపడుతున్నారు.

- నెల్లూరు వైద్యం(ఆంధ్రజ్యోతి)

- శరీరాకృతికి అది మూలం
- అలక్ష్యంతో పెరుగుతున్న వ్యాధిగ్రస్థులు
- జిల్లాలో 1.75 లక్షలకుపైగా బాధితులు
- నేడు ప్రపంచ వెన్నెముక వ్యాధుల నివారణ దినోత్సవం



ఆధునిక పోకడలతో రోగాలు

ప్రస్తుత ఆధునిక జీవన విధానంలో ప్రతి ఒక్కరు సెల్‌ఫోన్‌కు బానిసలవు తున్నారు. అలాగే ల్యాప్‌టాప్, కంప్యూటర్ల దగ్గరే ఎక్కువ సేపు గడపాల్సి వస్తోంది. వీటి వల్ల వెన్నెముకపై భారం పడుతోంది. ఒక్కోసారి మెడనొప్పితో అల్లాడిపోయే పరిస్థితి వస్తుంది. శరీరానికి తగిన వ్యాయామం లేకపోవడంతో అనేక మంది వెన్నెముక వ్యాధుల బారినపడుతున్నారని నిపుణులు చెబుతు న్నారు. వెన్నెముకలో కండ తొలగడం(డిస్క్‌ప్రాచ్), వెన్నుకు దెబ్బ తగలడం (స్పైన్‌ట్రామా), క్షయ, వెన్నులో కణితల వల్ల వెన్నుపూస వ్యాధిగ్రస్తమవుతుం ది. ఈ ప్రభావం శరీరంలోని ఇతర ప్రధాన అవ యవాలపై పడుతుంది. ముఖ్యంగా మహి ళల్లో రుతుస్రావం ఆగిపోయిన తర్వాత కాల్షియం లోపించి ఎముకలు గుల్లబారి వెన్నుపై తీవ్ర ప్రభావం చూపుతాయి. దీనిని ముందుగా గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధికి గురి కాకుండా బయటపడ వచ్చు. జిల్లాలో 1.75 లక్షల మందికిపైగా వెన్నెముక సంబంధిత వ్యాధులతో బాధపడుతు న్నారని వైద్యులు చెబుతున్నారు.

అందుబాటులో అధునాతన వైద్యం



వెన్నెముకకు సంబంధించి ఎన్నో ఆధునిక వైద్య విధానాలు అందుబాటు లో ఉన్నాయి. వెన్ను పై ఉండే కణితలను తొలగించే మైక్రో సర్జరీ విధానం కూడా ప్రస్తుతం అందుబాటులో ఉంది. అలాగే కీహోల్ సర్జరీ ద్వారా వ్యాధు లను నియంత్రించడం జరుగుతోంది. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు, భవనాల పైనుంచి కిందపడటం వంటి కారణాలతో వెన్నెముక దెబ్బతింటోంది. ఈ నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలి. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా పూర్తిగా కదలలేని పరిస్థితి వస్తుంది. 50 ఏళ్లు దాటిన మహిళల్లో ఈస్ట్రోజన్ హార్మోన్ తగ్గటం వల్ల వెన్నెముక సమస్య వస్తుంది.

- డాక్టర్ జొన్నలగడ్డ ధీరజ్, జీజీహెచ్, న్యూరో సర్జన్

ఎన్నో ఆధునిక వైద్య విధానాలు

వెన్నెముక వ్యాధులను ఎంఆర్ఐ స్కానింగ్ ద్వారా పూర్తిస్థాయిలో నిర్ధా రణ చేసే ఆధునిక విధానం అందుబాటులోకి వచ్చింది. మైక్రోసర్జరీ ద్వారా వెన్నులో కణితలు తొలగించడం మంచి ఫలితాలిస్తోంది. విరిగిన వెన్ను స్థానంలో కృత్రిమ వెన్నెముకను అమర్చి దీర్ఘకాలిక సమ స్యలను సైతం నిపుణులు పరిష్కరిస్తున్నారు. విరిగిన కొన్ని విభాగాలను స్క్రూలతో బిగించి సరి చేసే విధానమూ అందుబాటులో ఉంది. అయితే అన్ని రకాల వెన్ను వ్యాధులకు ప్రభు త్వ వైద్య పథకాలు వర్తించకపోవడంతో వ్యాధిగ్రస్తులైన పేదలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పొగనాట్లకు ఊపిరి..



మూడురోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో కొందరు ముమ్మరంగా పొగనాట్లు వేస్తున్నారు. దీంతో పొగనారుకు కూడా బాగా గిరాకీ పెరిగింది. అన్నీ చోట్ల నారు ఇంకా పూర్తి స్థాయిలో అందుబాటులో రానందున ప్రస్తుతం నారు మూట ధర రూ.2వేల వరకు పలుకుతుంది. బ్యారన్‌కు రూ. 6 నుంచి రూ.7లక్షల వరకు రైతులకు బ్యాంకర్లు పిలిచి రుణాలు ఇస్తుండటంతో వారికి కలిసొస్తున్నది. దీంతో డీసీపల్లి పొగాకు బోర్డు పరిధిలోని 10మండలాల రైతులు ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెంచే యోచనలో ఉన్నారు.

- మర్రిపాడు (ఆంధ్రజ్యోతి)

ఓ వృద్ధుడి సాహస యాత్ర

ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని గంగోత్రి నుంచి రామేశ్వరం వరకు సైకిల్ యాత్ర చేపట్టిన ఓ వృద్ధుడు భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా తన యాత్ర కొనసాగిస్తున్నాడు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మధురానగరానికి చెందిన చంద్రదాస్ సెప్టెంబరు 1వ తేదీన గంగోత్రి నుంచి రామేశ్వరంకు ఒంటరిగా సైకిల్ యాత్ర చేపట్టారు. ఈయన మంగళవారం కోవూరు సమీపంలో జాతీయ రహదారిపై సైకిల్ తొక్కుతూ కన్పించారు. ఏడు పదుల వయస్సున్న ఆ వృద్ధ యాత్రికుడు పట్టువదలకుండా భారీ వర్షం కురుస్తున్నప్పటికీ సైకిల్‌పై యాత్ర కొనసాగిస్తుండటాన్ని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా సైకిల్ యాత్రికుడిని శ్రీవారి పాదయాత్ర బృందం నిర్వాహకుడు దేవిరెడ్డి సురేష్‌రెడ్డి కలిసి అభినందించారు. చిరునవ్వులు చిందిస్తూ, ప్రతి నమస్కారాలు చేస్తూ సైకిల్ క్యారియర్‌కు బిగించిన సామగ్రితో సహా ఆయన నెల్లూరు వైపునకు బయలుదేరి వెళ్లారు.

- కోవూరు (ఆంధ్రజ్యోతి)



రోడ్డుపై గుంత... అధికారుల కళ్లకు గంత!

కలువాయి గ్రామ సచివాలయం ఎదురుగా పొదలకూరు-సోమశిల రోడ్డుపై చాలా రోజులుగా పెద్ద గుంత ఉంది. ఈ గుంతలో కాస్త మట్టివేసి పూడ్చేవారే కరువయ్యారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుపై గుంత కనిపిస్తుండటంతో ద్విచక్ర వాహనదారులు జాగ్రత్తగా తిరుగుతున్నారు. అయితే రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ గుంత నీటితో నిండి, వాహనదారులకు కనిపించడం లేదు. ఇది గమనించని ద్విచక్ర వాహనదారులు ఎక్కడ గుంతలో పడతారోనని కొందరు గుంతపై ముళ్ల కంప వేశారు.

- కలువాయి(ఆంధ్రజ్యోతి)



నేర వార్తలు (crime news) ఆంధ్రజ్యోతి

కలువాయిలో మరో చోరీ

- రూ. 90 వేల నగదు, 10గ్రాముల బంగారం అపహరణ

కలువాయి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెన్నకేశవాలయం సమీపంలోని కేతా శ్రీనివాసులరెడ్డి ఇంట్లో మరో చోరీ జరిగింది. ఇంట్లో బీరువాలో ఉన్న రూ.90వేలు నగదు, 10గ్రాముల బంగారాన్ని దుండగులు అపహరించుకుపోయారు. మంగళవారం ఉదయం పని మనిషి ఈ విషయాన్ని గుర్తించి వారి బంధువులకు తెలియజేయడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల కథనం మేరకు, కలువాయికి చెందిన కేతా శ్రీనివాసులరెడ్డి కాంట్రాక్టర్. ఆయన కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా బెంగళూరులో పనిచేస్తున్నారు. శ్రీనివాసులరెడ్డి దంపతులు కుమారుడి వద్దనే ఉంటున్నారు. శ్రీనివాసులరెడ్డి మాత్రం అప్పుడప్పుడు సొంతూరికి వస్తూ పోతుంటారు. ఈ క్రమంలో శ్రీనివాసులరెడ్డి ఈనెల 7న ఇంటికి తాళం వేసుకుని వెళ్లారు. మంగళవారం ఉదయం ఇల్లు చిమ్మేందుకు వచ్చిన పనిమనిషి ఇంటి ప్రధాన ద్వారం తెరచి ఉండటాన్ని గమనించి బంధువులకు తెలియజేసింది. ఇటీవల కలువాయిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు యడ్ల సురేష్ ఇంట్లో చోరీ జరిగిన విధంగానే ప్రధాన ద్వారం తాళం తొలగించి చోరీ చేశారు. ఈ సంఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.



చిందరవందరగా పడి ఉన్న బీరువాలోని దుస్తులు

వాహనం ఢీకొని జింక మృతి

వెంకటాచలం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చవటపాళెం పంచాయతీ పరిధిలోని సరస్వతి నగర్ వద్ద మంగళవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందింది. వివరాల మేరకు.. సమీపంలోని అటవీప్రాంతం నుంచి వచ్చిన ఒక జింక రహదారి దాటుతుండగా నెల్లూరు వైపు వేగంగా వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో జింక అక్కడికక్కడే మృతి చెందింది. అటుగా వెళ్తున్న వాహన చోదకులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందిండంతో అటవీ శాఖ అధికారులు వచ్చి జింక కళేబరాన్ని స్వాధీనం చేసుకొని దహన సంస్కారాలు నిర్వహించారు.



వాహనం ఢీకొని మృతి చెందిన జింక

యువకుడి బలవన్మరణం

- ఆలస్యంగా వెలుగులోకి..

కావలి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక వెంగాయగారిపాలెం కోలా శ్రీకాంత్ (26) ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. కుటుంబ గొడవలు, ఆర్థిక సమస్యలతో ఈ నెల 12వ తేదీన ఆయన ఇంటిలో నుంచి వెళ్లిపోయారు. ఆయన కోసం కుటుంబసభ్యులు గాలిస్తుండగా పాతూరు అక్కమ్మ బావిలో శవం తేలాడుతూ కనిపించారు. ఈ విషయాన్ని స్థానికులు గుర్తించి వీఆర్వో ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎండీ ఫిరోజ్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని బావిలో ఉన్న మృతదేహాన్ని బయటకు తీయించారు. ఈ విషయం కుటుంబసభ్యులకు తెలిపారు. ఆయన ఎప్పుడు బావిలో పడిన విషయం తెలియరాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి పోలీసులు కేసు నమోదు చేశారు. అక్కమ్మ బావిపై ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోక పోవడంతో తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపించారు. మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ బావిని పరిశీలించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



కోలా శ్రీకాంత్ (ఫైల్)

భార్యపై అనుమానంతో భర్త ఆత్మహత్య

మనుబోలు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లపాళెం గిరిజన కాలనీకి చెందిన వెందోటి శీనయ్య(33) భార్యపై అనుమానంతో మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. శీనయ్యకు 8 ఏళ్ల క్రితం అనూషతో వివాహమైంది. వీరికి ఇద్దరు చిన్న పిల్లలు. వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొద్ది నెలలుగా భార్యపై అనుమానం పెరిగి భార్యభర్తల నడుమ చిన్నపాటి వివాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం రాత్రి భార్యభర్తలు గొడవపడ్డారు. ఈ వివాదం పెద్దది కావడంతో శీనయ్య భార్యపై అలిగి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. తెల్లారేసరికి మడమనూరు సమీపంలో ఉన్న బండేపల్లి బ్రాంచ్ కెనాల్ వద్ద శవమై కనిపించాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్‌ఐ శివరాకేష్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. గుళికలు తిని ఆత్మహత్య చేసుకున్నట్లుగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



వెందోటి శీనయ్య మృతదేహం

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	145
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	258
స్కిన్‌లెస్	284
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7327
వెండి కిలో ధర	రూ. 92,600
వెండి ఒక గ్రాము	రూ. 95.60

గుర్తు తెలియని వృద్ధురాలి ఆత్మహత్య

నెల్లూరు క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వృద్ధురాలు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మంగళవారం వెంకటేశ్వరపురం రైల్వే బ్రిడ్జి వద్ద చెన్నై వైపు వెళ్లే రైలు పట్టాలపై జరిగింది. సుమారు 60 ఏళ్ల మహిళ మృతి చెందింది. మృతదేహంపై నలుపు రంగు మీద పసుపు రంగు చీర, పసుపు రంగు జాకెట్ ఉన్నాయి. సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ జీ మాల కొండయ్య ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతురాలి వివరాల కోసం గాలిస్తున్నారు.

అక్షరాస్యతతోనే అభివృద్ధి : కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (విద్య), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అక్షరాస్యతతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని కలెక్టర్ ఆనంద్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉల్లాస్ కార్యక్రమ నిర్వహణపై మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో 19,178 మంది నిరక్షరాస్యులను అభ్యాసకులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. చదువు మధ్యలో మానేసిన వారు, 15 ఏళ్లు పైబడిన నిరక్షరాస్యులకు చదువు నేర్పించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రధానంగా స్వయం సహాయక బృందంలోని చదువురాని మహిళలు, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాలు, వంటవారు, హెల్పర్లు, నైట్ వాచ్‌మెన్, అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే నిరక్షరాస్యుల కోసం ఈ కార్యక్రమం రూపొందించారని చెప్పారు. ఆర్థిక అక్షరాస్యత, ఫంక్షనల్, డిజిటల్ లిట్రసీ మీద దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. 'ఉల్లాస్'కు సంబంధించిన సర్వే, మ్యాచింగ్ బ్యాచింగ్‌ను ఈనెల 24వతేదీకి పూర్తి చేయాలని ఆదేశించారు. అక్షరాస్యత కేంద్రాలుగా అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకునేందుకు అనుమతులు ఇవ్వాలని ఐసీడీఎస్ పీడీకి సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, జిల్లా విద్యా శాఖాధికారి రామారావు, డీపీఆర్వో సదారావు తదితరులు పాల్గొన్నారు.




అధికారికి సూచనలిస్తున్న కలెక్టర్ ఆనంద్

కూరగాయల మార్కెట్లో కూలీ హత్య

- హతుడిపై రౌడీ షీట్
- టిఫిన్ చేస్తుండగా కత్తితో దాడి

నెల్లూరు (క్రైం), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని మద్రాస్ బస్టాండు వద్ద మంగళవారం తెల్లవారుజామున కూరగాయల మార్కెట్లో పనిచేసే కూలీని ఇద్దరు యువకులు హత్య చేశారు. పోలీసుల సమాచారం మేరకు.... నగరం లోని అనగుంటకు చెందిన వాకా అశోక్ (29)పై రౌడీ షీట్ ఉంది. 2018లో పానీ పూరి అమ్మే వ్యక్తిని హత్య చేసిన ఘటనలో ఆయనపై వేదాయపాళెం పోలీసులు రౌడీ షీట్ తెరిచారు. ప్రస్తుతం అశోక్ ముత్తుకూరు గేటు సెంటర్‌లోని సర్వేపల్లి కాలువ కట్టపై ఉంటూ ఏసీ కూరగాయల మార్కెట్లో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య జానకీ, కుమారులు చరణ్ సాయి, ఉదయ్ ఉన్నారు. వారు ఇటీవల సత్యవేడుకు వెళ్లారు. సోమవారం రాత్రి అశోక్ కూరగాయల మార్కెట్లో పని చేసుకుని టిఫిన్ కోసం దుకాణం వద్దకు వెళ్లాడు. అక్కడ టిఫిన్ చేస్తుండగా ఇద్దరు యువకులు వచ్చి గొడవపడ్డారు. వారిలో ఒకరు కత్తితో బలంగా అశోక్‌ను పొడిచారు. టిఫిన్ అంగడి నిర్వాహకుడు రమేష్ అడ్డుకోవడంతో నిందితులు పరారయ్యారు. తీవ్రంగా గాయపడ్డ అశోక్ అక్కడి నుంచి నడుచుకుంటూ కూరగాయల మార్కెట్లోకి వెళ్లి ఓ దుకాణం వద్ద కుప్పకూలిపోయాడు. స్థానికుల సమాచారంతో 108 వాహనం సిబ్బంది అశోక్‌ను జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం అశోక్ మృతి చెందాడు. అశోక్ సోదరుడు వంశీ ఫిర్యాదు మేరకు చిన్నబజారు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ఘటనా స్థలంలోని సీసీ ఫుటేజ్‌లో నిందితులు పరారవుతున్న దృశ్యాలు కనిపించాయని సమాచారం. వాటి ఆధారంగా నిందితులను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.



కూరగాయల మార్కెట్లో దుకాణం వద్ద రక్తగాయాలతో అశోక్



కనిగిరి రిజర్వాయర్‌లో మెట్ట ప్రాంతాన్ని తలపిస్తున్న పూడిక


కలగానే పూడికతీత

- 6 నుంచి 1.5 టీఎంసీలకు పరిమితమైన కనిగిరి రిజర్వాయర్
- కాలువల్లోనూ పూడిక తీయని వైనం
- ఆవేదనలో ఆయకట్టు రైతులు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): సుమారు 20వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో నిర్మితమైన కనిగిరి రిజర్వాయర్ పూడికతో నిండి ఉంది. పెన్నా నుంచి వచ్చే నీటి ప్రవాహంతో వచ్చిన బురద, ఇసుక, బంకమట్టితో పూడిపోగా, 6 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్ నేడు 1.5 టీఎంసీలకే పరిమితమైంది. ఎన్ని ప్రభుత్వాలు మారినా పూడికతీతను పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాభావంతో రిజర్వాయర్‌లో నీరు అడుగంటిన ప్రతీసారి పూడికతీతపై రైతులు ఆశలు పెట్టుకుంటూనే ఉన్నారు. అయినా తట్టమట్టి తీసిన పాపాన పోలేదు. 2014లో టీడీపీ ప్రభుత్వం హయాంలో కనిగిరి రిజర్వాయర్‌తో పాటు పలు చెరువుల్లో పూడికతీత చేపట్టారు. అయితే అప్పటి ప్రతిపక్ష పార్టీ వైసీపీ విమర్శలతో పూడికతీత అర్ధంతరంగానే ఆగిపోయింది. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వంలో అసలు ఆ ఊసే లేదు.

పూడిక తీస్తే పూర్వవైభవం

రబీ సాగు పూర్తయ్యాక వేసవిలో రిజర్వాయర్‌లో పూడిక తీసేందుకు అవకాశం వుంది. అదే జరిగితే మళ్లీ రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రత్యేక దృష్టి సారించి రిజర్వాయర్‌లో పూడిక తొలగిస్తే పూర్వవైభవం సంతరించుకుంటుంది.



- నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు, బుచ్చి

కాలువల్లో పూడికతీయకుంటే సాగునీరు వృథా

వరినార్లు పోసుకునే సమయం ఆసన్నమైంది. ఐదేళ్లుగా ఒక్క కాలువలో కూడా పూడికతీయలేదు. దీంతో అవి పూడిపోయి చుక్క నీరు కిందకు పోయే అవకాశంలేదు. ప్రస్తుతం కాలువలకు నీరు విడుదల చేస్తే అంతా వృధా అవు తుంది. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చొరవ తీసుకుని కాలువల్లో పూడిక తీయించాలి.

- ముత్యాల గుర్నాథం, రైతు సంఘం నాయకుడు

జాగ్రత్త సుమా!

- విద్యుత్ సిబ్బందితో నోడల్ అధికారి ఆదిశేషయ్య

మనుబోలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ సిబ్బంది వారికి కేటాయించిన గ్రామాల్లో అందుబాటులో ఉండాలని ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్, జిల్లా నోడల్ అధికారి ఆదిశేషయ్య అన్నారు. మంగళవారం మనుబోలు సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, సిబ్బందితో సమీక్షించారు. తుఫాన్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే కంట్రోల్ రూమ్‌కు లేదా టోల్‌ఫ్రీ నెంబర్ 1912కు, వాట్సాప్ నెం.9133331912కు సమాచారం ఇవ్వాలన్నారు. తుఫాన్ తీరం దాటే సమయంలో విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉంటాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమీక్షలో ఈఈ నరేంద్రరెడ్డి, డీఈ ప్రసాద్, ఏఈలు అనీల్, శేషాద్రి పోలయ్య, సబ్‌ఇంజనీరు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న నోడల్ అధికారి ఆదిశేషయ్య

మత్స్యకార సంఘం పాలకవర్గం రద్దు

- ప్రత్యేక అధికారిగా సంజయ్ స్టీఫెన్

కలువాయి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):కలువాయి మత్స్యకార సంఘం పాలకవర్గాన్ని రద్దు చేస్తూ మత్స్యశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు ఎం.నాగేశ్వరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.ఇక నుంచి సంఘం కార్యకలాపాలు నిర్వహించుటకు ప్రత్యేక అధికారిగా నెల్లూరు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కే సంజయ్ స్టీఫెన్‌ను నియమించారు. ప్రస్తుత పాలకవర్గం వారు సంఘం కార్యకలాపాలు సక్రమంగా నిర్వహించడం లేదని, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కొంతమంది సభ్యులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సంఘం కార్యకలాపాలను తనిఖీ చేసేందుకు పాలకవర్గం సభ్యులను పుస్తకాలు ఇవ్వాలని కోరగా, వారు ఇవ్వలేదు. దీనిపై జేడీ సమగ్ర విచారణకు ఆదేశించారు. విచారణ అధికారి కావలి ఏడీ శ్రీనివాసులు మహాజనసభ ఏర్పాటు చేసి విచారణ జరిపారు. విచారణలో పాలకవర్గ సభ్యులు తమను ఎలాంటి సమావేశాలకు పిలవలేదని, తాము హాజరైనట్లు తమ సంతకాలు ఫోర్జరీ చేశారని కొందరు సభ్యులు తెలిపారు. కువైట్‌కు వెళ్లివారు కూడా సమావేశాలకు వచ్చినట్లు సంతకాలు ఫోర్జరీ చేశారని విచారణ అధికారి దృష్టికి వచ్చింది. దీంతో ఈ పాలకవర్గాన్ని రద్దు చేయాలని విచారణ అధికారి ఉన్నాతాధికారులకు సిఫార్సు చేశారు. ఈ నేపధ్యంలో పాలకవర్గం అధ్యక్షుడు హైకోర్టును ఆశ్రయించగా ఇరువర్గాల వాదనలు తరువాత సంఘం రికార్డులు అన్నీ రెండు వారాల్లోపు విచారణ అధికారికి అందజేయాలని, ఈ కాలంలో విచారణ కూడా నిలిపివేయాలని హైకోర్టు ఆదేశించినట్లు జేడీ పెర్కొన్నారు. అయితే పాలకవర్గం వారు రికార్డులు కొన్ని మాత్రమే ఇచ్చి ముఖ్యమైన విక్రయం, రాబడి, అప్పులు, ఖర్చులు వాటికి సంబంధించిన బిల్లులు, బ్యాంకు పుస్తకాలు ఇవ్వకుండా హైకోర్టు ఉత్తర్వులు ఉల్లంఘించారని జేడీ పేర్కొన్నారు. విచారణ అధికారి సిఫార్సు, హైకోర్టు ఉత్తర్వులు ఉల్లంఘించినందుకు పాలకవర్గాన్ని రద్దు చేస్తున్నట్లు జేడీ పేర్కొన్నారు.

పండుగ రోజుల్లో 'ప్రైవేటు' దోపిడీ

ఉదయగిరి రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉదయగిరి నుంచి బెంగళూరుకు మామూలు రోజుల్లో ప్రైవేటు బస్సు టికెట్టు ధర రూ.600లోపే ఉంటుంది. పండగ సీజన్‌లో రూ.1,200 వరకు వసూలు చేస్తారు. అయితే ఇప్పుడు ఏకంగా సీటింగ్‌కు రూ.1,650, స్లీపర్‌కు రూ.2,500ల చొప్పున వసూలు చేస్తున్నారంటే వారి దోపిడీ ఎలా ఉందో అర్థమవుతోంది. ఉదయగిరి మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు సోమవారం రాత్రి బెంగళూరు వెళ్లేందుకు ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఎక్కారు. వారి వద్ద నుంచి సీటింగ్‌కు రూ.3,300లు ప్రైవేటు బస్సు ఆపరేటరు టికెట్టు వసూలు చేశాడు. ప్రయాణికులు ఇదేంటని ప్రశ్నించగా వర్షం పడుతుండగా, టికెట్టు ధర తగ్గిందని, నిన్నటివరకు సీటింగ్‌కే రూ.2,500లు వసూలు చేశామని చెప్పడంతో వారు ఖంగుతున్నారు. రవాణా అధికారులు ఈ దోపిడీని అరికట్టాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

న్యాయం చేయండి!

విడవలూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నాభర్తతో తాను జీవనం సాగించేలా న్యాయం చేయాలని విడవలూరు గిరిజన కాలనీకి చెందిన అర్చన కోరింది. విడవలూరులో మంగళవారం ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఊటుకూరు శంకర్‌నగర్ కాలనీకి చెందిన గణేష్‌తో తనకు 7 ఏళ్ల క్రితం వివాహం అయిందన్నారు. అయితే సంతానం కలుగకపోవడంతో తన భర్త రోజూ మద్యం సేవించి ఇంటికి వచ్చి నానా ఇబ్బందులకు గురి చేస్తూ మానసిక వేధింపులకు పాల్పడటమే కాకుండా తనని ఇంటి నుంచి బయటకి తరిమేశాడని అవేదన వ్యక్తం చేసింది. దీంతో గత 8 నెలలుగా పుట్టినింట్లో తలదాచుకుంటున్నానని, ఇటీవల తన భర్త మరో వివాహం చేసుకొనేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడని తెలిసి ఈ విషయాన్ని ఏప్రిల్ 4న దిశ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. వారు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వారం రోజుల క్రితం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, అయినా కూడా వారూ స్పందించలేదన్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

న్యూస్ బాక్స్

గ్రామాల్లో మద్యం చిచ్చు రేపొద్దు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మద్యం బెల్టు షాపులు ఏర్పాటు చేసి చిచ్చురేపొద్దని సీపీఎం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రశాంతతకు మారుపేరైన గ్రామాల్లో బెల్టుషాపులు ఏర్పాటు చేసి వివాదాలకు అజ్యం పోయవద్దన్నారు. అదే జరిగితే సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గుజ్జుల మల్లికార్జున, లక్ష్మీనరసయ్య, రమణయ్య, రమణయ్య పాల్గొన్నారు.

21కి పల్లెపండుగ వాయిదా

సీతారామపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమం సీతారామపురం మండలంలో ఈ నెల 18వ తేదీ జరగాల్సి ఉండగా, 21కి వాయిదా వేస్తున్నట్లు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రైతు సేవా కేంద్రాల్లో ట్రైకోడెర్మావిరిడి

లింగసముద్రం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల రైతుసేవా కేంద్రాలకు 105 కేజీల ట్రైకోడెర్మావిరిడి మందు వచ్చినట్లు వ్యవసాయ అధికారి అబ్రహం లింకన్ తెలిపారు. మంగళవారం మొగిలిచెర్ల, ముత్యాలపాడులో పొలంపిలుస్తోంది నిర్వహించారు. కార్యక్రమంలో మొగిలిచెర్ల పశుసంవర్ధక శాఖ జూనియర్ వెటర్నరీ రమణమ్మ, మార్కెటింగ్ శాఖ సహాయకులు, వీఏఏలు ప్రేమ్ బాబు, దీప పాల్గొన్నారు.

వృత్తివిద్యా కోర్సులతో ఉపాధి

కొండాపురం,అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యాకోర్సులతో భవిష్యత్తులో మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చని ఆదర్శ పాఠశాల వొకేషనల్ కోర్సు కో ఆర్డినేటర్స్ డి.మల్లికార్జున, డి.ప్రాన్సిస్‌లు తెలిపారు. సమగ్ర శిక్ష మరియు పీఎమ్ (శ్రీ) లెగ్నెట్ వారి ఆధ్వర్యంలో ఆటో మోటివ్ వృత్తి విద్య ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆదర్శ పాఠశాలలోని ఇంటర్ విద్యార్థులకు ప్రత్యక్షంగా శిక్షణ ఇచ్చారు. శిక్షణను పాఠశాల ప్రిన్సిపల్ ఖాదర్ బాషా పర్యవేక్షించారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

బిట్రగుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం చెంచులక్ష్మీపురం కోదండరామస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం నూతన ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఆగమ పండితులు వినోద్‌కు మార్ ఆచార్యులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ధ్వజ కుంబారాధన, సుదర్శన హోమం, క్షీరాధివాస కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ వ్యవస్థాపకులు పసుపులేటి సుధాకర్, సుగుణమ్మ దంపతులు ఉభయ కార్యకర్తలుగా వ్యవహరించారు.

కందుకూరు అభివృద్ధి మండలి సమావేశం



కందుకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధి మండలి సమావేశం మంగవారం స్థానిక ఆదిత్య హోటల్‌లో మాజీ శాసనసభ్యులు దివి శివరాం అధ్యక్షతన జరిగింది. రామాయపట్నంలో ఉద్యోగ అవకాశాలు, నిజుల్లో ఉద్యోగ అవకాశాలు, రాళ్లపాడు ప్రాజెక్టు తాగు, సాగు నీరు, గ్రామాల్లో రోడ్ల నిర్మాణం ఇతర సౌకర్యాలపై అభివృద్ధి మండలి సభ్యులు సమావేశంలో చర్చించారు. ప్రతి అంశాన్ని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు తూమాటి మాధవరావు, కంచర్ల శ్రీకాంత్‌లతో చర్చించి వారి సహాయ సహకారాలతో ముందుకు వెళ్లాలని వారు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అనంతరం అభివృద్ధి మండలి పూర్తిస్థాయి కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాజీ శాసన సభ్యుడు డాక్టర్ దివి శివరాం, ఉపాధ్యక్షులుగా షేక్ రఫీ, పాలేటి కోటేశ్వరరావు, కార్యదర్శిగా నేతి మహేశ్వరరావు, సహాయ కార్యదర్శిలుగా బొక్క వెంకటేశ్వర్లు, సురేష్‌బాబు, కోశాధికారిగా మాధవరావు, సభ్యులుగా పులిచర్ల వెంకట సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, అధికార ప్రతినిధులుగా రావుల కొల్లు వెంకటేశ్వర్లు, ముప్పవరపు కిషోర్ లు ఉన్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి

కందుకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశ మిస్సైల్ మ్యాన్‌గా, పోఖ్రాన్ అణు పరీక్షల పితామహుడిగా ఖ్యాతి గడించిన మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రక్షణ రంగంలో దేశం కోసం ఆయన సాధించిన కృషిని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ముస్లిం మైనారిటీ అధికార ప్రతినిధి షేక్ రఫీ, పట్టణ అధ్యక్షుడు షేక్ సలాం, షేక్ మా బాష, రెహమాన్, రూబీ, మున్నా, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ శ్రీధర్‌కు పురస్కారం

కావలి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్పీ శ్రీధర్‌కు జిల్లాస్థాయి జాతీయ రక్తదాన దినోత్సవ పురస్కారాన్ని కావలి రెడ్‌క్రాస్ ప్రతినిధులు మంగళవారం పురస్కారం అందజేశారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో రక్తదాన శిబిరాల ఏర్పాటుకు కృషి చేశారని తెలిపారు.

ఆక్రమణలో రోడ్లు.. ట్రాఫిక్ పాట్లు

పట్టించుకోని అధికారులు



వలేటివారిపాలెం బస్టాండు సెంటరులో ట్రాఫిక్‌తో నిలిచిపోయిన వాహనాలు

వలేటివారిపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బస్టాండు సెంటరులోని మూడు రోడ్ల కూడలిలో నెలకొంటున్న ట్రాఫిక్‌తో నిత్యం ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు రోడ్లపైనే నిలుతున్నారు. రోడ్లకు రెండు వైపులా ఉన్న దుకాణాదారులు రోడ్లను ఆక్రమించి పుట్‌పాత్‌లపై రేకులషెడ్లు వేసుకున్నారు. అంతేగాకుండా తమ దుకాణాలు ముందు ఎత్తుగా మట్టి తోలుకోవడంతో వర్షం నీళ్ల రోడ్డుపైనే నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. ఆ నీళ్లలోనే వాహనదారులు ప్రయాణించాల్సిన పరిస్థితి ఉంది. ప్రయాణికులకు కనీసం రోడ్డుపైన నిలబడే అవకాశం లేకుండా పోయింది అంటే పరిస్థితి ఎలా ఉందో మీరే అర్థం చేసుకోవచ్చు. వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో జామాయిల్ ట్రాక్టర్లు, చిల్లకర్ల లారీలు, వరిగడ్డి లారీలు, ట్రాక్టర్లు జోరుగా తిరుగుతుంటాయి. ఈ సమయంలో బస్సులు ఎదురుగా వస్తే ప్రక్కకు వైదొలిగే అవకాశం లేక గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతుంది. అంతేగాకుండా ఆటోలు మూడు రోడ్ల కూడలిలో దివి కొండయ్య చౌదరి విగ్రహం వద్ద నిలపడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆదివారం, పండుగ సమయాల్లో చికెన్, మటన్ దుకాణుదారులు రోడ్డుపైనే నిర్వహించడంతో రోడ్డం తా జనంతో కిక్కిరిసిపోతుంది. చికిన్ మటన్ కోసం వచ్చే జనం ద్విచక్ర హనాలను, కార్లను రోడ్డుపై నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు రోడ్డుపైనే చేపల మార్కెట్ నిర్వహిస్తున్నారు. ప్రతి శనివారం మాలకొండ పుణ్యక్షేత్రానికి వెళ్లేందుకు బస్టాండు సెంటరు ప్రయాణికులతో కిక్కిరిసిపో తుంది. ఆ రోజు ట్రాఫిక్ కష్టాలు చెప్పనలవికాదు. ఉదయం, సాయంత్రం వేళల్లో పశువులు, సన్నజీవాలు పొలాలకు వెళ్లే సమయంలోనూ పొలాల నుండి సాయంత్రం ఇంటికి వచ్చే సమయాల్లో రోడ్లపైనే వాహనాలు నిలపాల్సి వస్తుంది. సంబంధిత అధికారులు చూసీచూనట్లుగా వెళుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

సంగమేశ్వరాలయ హుండీల లెక్కింపు

సంగం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరాలయ హుండీలను దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం లెక్కించారు. గర్భగుడి వద్ద ఏర్పాటు చేసిన రెండు హుండీల నుంచి ఆరు నెలల కాలానికి సుమారు రూ. 37,734లు భక్తుల నుంచి కానుకలు వచ్చా యి. ఈ మొత్తం నగదును బ్యాంకు ఖాతా లో జమ చేయనున్నట్లు ఈవో చైతన్య తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పూజారి గోపాలకృష్ణమూర్తి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పల్లెపండుగతో కొత్త వెలుగులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో కొత్త వెలుగులు సంతరించుకొంటున్నాయని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు పేర్కొన్నారు. మంగళవారం నర్రవాడలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోక సర్పంచులు ఉత్సవ విగ్రహాలుగా మారారన్నారు. పల్లెపండుగ పేరుతో కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు.

సీతారామపురం(ఆంధ్రజ్యోతి): పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయాధికారి పీ చెన్నారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పొలంగారి పల్లి గ్రామంలో సాగు లో ఉన్న వరి పొలలను సందర్శించారు. వరిలో ఆకుముడుత పురుగు ఉన్నట్లు గుర్తించారు. నివారణకు క్లోరోపైరిపాస్ పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి వెంకట సుబ్బయ్య,ఏఎంసీ యార్డు అసిస్టెంట్ చిరంజీవి, ఏహెచ్ఏ శ్వేత, వీఏఏలు లక్ష్మీనారాయణ, నరేంద్ర పాల్గొన్నారు.

వృద్ధుడికి సీఐ సాయం

ఏఎస్ పేట (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 15: నిస్సాయస్థితిలో ఉన్న వృద్ధుడికి సంగం సీఐ సాయం చేశారు.మంగళవారం గుడిపాడుకు వచ్చి తిరిగి వెళుతుండగా పెద్దఅబ్బీపురం గ్రామ సమీపంలో వర్షంలో ఓ వృద్ధుడు రోడ్డు పక్కన స్పృహ తప్పి పడి ఉండడం గమనించిన ఆయన కారు దిగి ప్రత్యేక వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

వెంటాడుతున్న తుఫాన్ ముప్పు

● సురక్షిత ప్రాంతాలకు లోతట్టు ప్రాంతవాసుల తరలింపు ● వాగులు, వంతెనల వద్ద పోలీసుల పహారా



తుమ్మలపెంట రోడ్డులో చప్టాలపై పారుతున్న నీటి వద్ద భద్రతగా రూరల్ సీఐ, సిబ్బంది

ఆత్మకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. ఆర్డీవో పావని ఆ దేశాలతో రెవెన్యూ అధికారులు లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. తుఫాన్ ప్రభావంతో నియోజకవర్గంలో మంగళవారం ఉదయం ఓ మోస్తారు వర్షం కురిసింది. అనంతరం కాస్త తెరపిచ్చింది. ముందస్తుగా ముంపు ప్రాంతవాసులను సురక్షిత ప్రదేశాలకు, పునరావాస కేంద్రాలకు తరలించారు. ఆత్మకూరు, అనంతసాగరం మండల్లాలోని నాలుగు ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆత్మకూరు మండలం బండారుపల్లి, అప్పారావుపాళెం, కరటంపాడు, అనంతసాగరం మండలం పడమటికంభంపాడులో 160 మం దిని పునరావాస కేంద్రాలకు తరలించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: ఆర్డీవో

తుఫాన్ ప్రభావంతో అధికార యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో బీ.పావని తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం నుంచే ఆమె మంగళవారం డివిజనల్ స్థాయి అధికారులతో ఫోన్‌లో సమీక్షించారు. ప్రాణ, ఆస్తి, పంట నష్టం సంభవించినా, ప్రజలకు ఇబ్బందకర పరిస్థితులు ఎదురైనా వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఆమె ఆత్మకూరు డివిజన్ పరిధిలోని పెన్నా పరివాహక ప్రాంతాలైన వీర్లగుడిపాడు, అప్పారావుపాళెం, కొత్తపాళెం తదితర లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు.

● ఉదయగిరిలో 49.6 మి.మీ వర్షపాతం

ఉదయగిరి రూరల్: తుపాన్ ప్రభావంతో మండలంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల వరకు 49.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతమైనా చినుకు రాలలేదు.

● ఎస్టీ కాలనీని సందర్శించిన తహసీల్దారు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): మంగళవారం నర్రవాడ ఎస్టీ కాలనీని తహసీల్దారు నాగరాజు సిబ్బందితో సందర్శించారు. వర్షాలతో కాలనీవాసులు జాగ్రత్తగా ఉండాలని, వర్షాలు అధికమైతే సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామన్నారు.

● డీఎస్పీ వాగులు,వంతెనల పరిశీలన

ఏఎస్‌పేట: మండలంలోని వాగులు, వంతెనలను ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి పరిశీలించారు. రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నందున వాగులు పొంగి రోడ్డుపైకి నీటి ప్రవాహం వచ్చే ఆవకాశం ఉన్న గుడిపాడు బీరాపేరు వాగు వంతెన,ఏఎస్ పేట సమీపంలోని నక్కల వాగు వంతెనను పరిశీలించారు. కార్యక్రమంలో సంగం సీఐ వేమారెడ్డి,ఎస్ఐ సైదులు,తదితరులు పాల్గొన్నారు.

● పెన్నా ముంపు ప్రాంతం పరిశీలన

సంగం: మండలంలో పెన్నా ముంపు ప్రాంతమైన అన్నారెడ్డిపాళెం ఎస్సీ కాలనీని తహసీల్దారు సోమ్లానాయక్ మంగళవారం పరిశీలించారు. భారీ వరద వచ్చి పెన్నా ఉప్పొంగితే అన్నారెడ్డిపాళెం ఎస్సీ కాలనీలోకి నీరు చేరే అవకాశం ఉంది. తహసీల్దారు కాలనీవాసులతో మాట్లాడారు. ఆయన వెంట వీఆర్వో కుమార్ ఉన్నారు. వంగల్లు కలుజును డీఎస్పీ వేణుగోపాల్ మంగళవారం పరిశీలించారు. చవిటివాగుపై ఉన్న కలుజును కూడా పరిశీలించారు. కలుజుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సీఐ వేమారెడ్డికి సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజేష్ పాల్గొన్నారు.

● మర్రిపాడు చెరువుకు రక్షణ చర్యలు

మర్రిపాడు చెరువు తూము వద్ద బలహీనంగా ఉన్న చెరువు కట్టకు మంగళవారం రక్షణ చర్యలు చేపట్టారు. ఇసుక బస్తాలతో రింగ్‌బండ్‌గా వేశారు. ఈ పనులను ఏఈ వినయ్ కుమార్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

● ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జలదంకి: తుఫాను ప్రభావం ఉండటంతో అన్ని గ్రామాల ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని తహసీల్దార్ ప్రమీల తెలిపారు. మంగళవారం ఆమె మండలకేంద్రంలో గుడిసెల్లో నివసిస్తున్న వారి ఇళ్ల పరిశీలించి జాగ్రత్తలు తెలిపారు. అనంతరం జలదంకి పెద్దచెరువును జలవనరుల శాఖ ఏఈ రామారావుతో కలసి పరిశీలించారు. ఈమె వెంట ఆర్ఐ శ్రీజ, వీఆర్వో గిరి, టీడీపీ మండలాధ్యక్షుడు మధురెడ్డి, స్థానిక రైతులు ఉన్నారు.

● నిరుపేదలకు ఆహర పొట్లాలు

లింగసముద్రం: తిమ్మారెడ్డిపాలెం ఎస్టీ కాలనీలో తుఫాను బాధితులకు టీడీపీ నేత నీలం బ్రహ్మారెడ్డి, సచివాలయ సిబ్బంది ఆహర పొట్లాలు అందజేశారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచనల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యదర్శి షేక్ గౌస్‌బాషా, సర్వేయరు శివప్రసాద్ పాల్గొన్నారు.

కలిగిరి: వరద ముంపులో ఉన్న స్థానిక వెంకన్నపాలెం ఎస్టీ కాలనీలో మంగళవారం పంచాయతీ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని పారిశుధ్య కార్మికులతో కాలువలు తవ్వించి నీటిని తరలిం చా రు. స్థానిక పీహెచ్‌సీ నుం డి వచ్చిన వైద్య సిబ్బంది కాలనీవాసులకు జాగ్రత్త లు వివరించి మందు లు అందజేశారు. పాలకులు బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పుల్లా వేమ నారాయణ, పుల్లా రవి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

● ఇస్కపల్లి తీరంలో పోలీసుల పర్యవేక్షణ

అల్లూరు: తుఫాన్ నేపథ్యంలో కావలి రూరల్ సీఐ పాపారావు, అల్లూరు ఎస్ఐ కిషోర్‌బాబులు సోమవారం తీరప్రాంత గ్రామాలు ఇస్కపల్లి, గోగులపల్లి ప్రాంతాల్లో పర్యవేక్షించారు. పరిస్థితులను పరిశీలించడంతో పాటు స్థానిక మత్స్యకారులతో కలసి పలు సూచనలు ఇచ్చారు. జిల్లా కలెక్టరు, ఎస్పీల ఆదేశాల మేరకు సముద్రంలోకి వెళ్లకూడదన్నారు. అనంతరం ముంగమూరు, జువ్వలదిన్నె, తాటిచెట్లపాలెంతో పాటు ఇస్కపల్లి, గోగులపల్లి కల్వర్టులను పరిశీలించారు.

కావలి: ఆర్డీవో ఎం.వంశీక్రిష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌తో కలిసి పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు మర్రిచెట్టు సంఘం, మందాడిచెరువు ప్రాంతాలను పరిశీలించారు. కొందరిని ముసునూరు హైస్కూల్, రామమూర్తిపేట మున్సిపల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. అలాగే పెంకుల ఫ్యాక్టరీ గిరిజన సంఘం ప్రాంతవాసులను వైకుంఠపురం మున్సిపల్ పాఠశాలలోని పునరావాస కేంద్రానికి తరలించారు. అన్నపుగుంట ప్రాంతాన్ని పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అల్పపీడన ప్రభావం రెండు రోజులు ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే పేపాలవారిపాలెంలో సోమవారం రాత్రి విద్యుత్ స్తంభం కూలిపోయింది. ఈ సమస్యతో గామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామ టీడీపీ నాయకులు పేపాల కోటేశ్వ రరావు, రమేష్‌లు వెంటనే కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు స్పందించిన విద్యుత్ ఏఈ శ్రీనివాసులు రెడ్డి తమ సిబ్బందితో ఆ గ్రామానికి చేరుకుని పడిపోయిన స్తంభం స్థానంలో మరొకటి ఏర్పాటు చేశారు. మంగళవారం సాయంత్రానికి విద్యుత్ పునరుద్ధరించడంతో ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

● పునరావాస కేంద్రాలకు తరలింపు

భారీ వర్షాలకు నీట మునిగిన మన్నేటికోట గ్రామం తిరుపతి కుంట ఎస్టీ కాలనీవాసులను స్థానిక ఎస్సై అంకమ్మ తన సిబ్బందితో గ్రామంలోని జీవీఆర్ ఎస్టీ సంఘంలోని తుఫాన్ షెల్టర్‌కు తరలించారు. పునరావస కేంద్రంలో మంచి నీరు, విద్యుత్ సదుపాయం, భోజన వసతికి తగిన ఏర్పాట్లు కల్పించినట్లు తహసీల్దార్ లావణ్య తెలిపారు. అలాగే మున్సిపాలిటీ పరిధి లోని గడ్డంవారి కొస్టాలు, 1,2వ వార్డులోని యానాది కాలనీ, పుట్ట ప్రాంతంలోని నివాస గృహాలలోకి వర్షం నీళ్లు చేరాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే 200 మంది బాధితులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, గడ్డం మాలకొండయ్య, ముచ్చు వేణు, పులి నాగరాజు, వడ్డెల్ల రవిచంద్ర పాల్గొన్నారు.

బిట్రగుంట: ముంగమూరు, జువ్వలదిన్నె,బంగారుపాలెం, ఏనుగులబావిలో రూరల్ సీఐ పాపారావు పర్యటించారు. తాటిచెట్లపాలెం ప్రజలతో మాట్లాడారు. అనంతరం ఇస్కపల్లి మత్స్య కారులను కలిసి సలహాలు ఇచ్చారు. ఆయనతో పాటు స్థానిక ఎస్ఐ భోజ్య, అల్లూరు ఎస్ఐ కిశోర్ బాబు, ఏఎస్ఐ సుధాకర్‌రెడ్డి ఉన్నారు. తహసీల్దారు సురేష్‌బాబు ఎస్వీ పాలెం, జువ్వలదిన్నె, సీఆర్‌పాలెంలో తిరిగారు.



ఆత్మకూరు : అప్పారావుపాళెంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో భోజనం చేస్తున్న గిరిజన కాలనీవాసులు



ఆత్మకూరు : అప్పారావుపాళెం కాలనీవాసులతో మాట్లాడుతున్న ఆర్డీవో పావని



సంగం : ఇసుక బస్తాలతో రింగ్‌బండ్ పనులను పరిశీలిస్తున్న ఏఈ వినయ్‌కుమార్

అబ్దుల్ కలాం సేవలు మరువలేనివి

● రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదానం ● ఘనంగా జయంతి వేడుకలు



కావలి టౌన్: నివాళులర్పిస్తున్న డాక్టర్ ప్రభాకర్‌నాయుడు తదితరులు

కావలి టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు మరువలేనివి అని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి కొనియాడారు. మంగళవారం పట్టణంలోని డాక్టర్ ప్రభాకర్ నాయుడు పీఎస్సార్ ట్రస్ట్ ఆసుపత్రిలో స్వచ్ఛంద సంస్థ ల వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాష, వివిధ సంస్థల నిర్వాహకులు ప్రసాదరావు, అజిత్‌బాబు, సురేంద్ర, మధుసూదన్‌రావు, కిరణ్‌కుమార్, నందిపాటి రమేష్, మాలకొండారెడ్డి, మస్తాన్ పాల్గొన్నారు.

● ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో రెడ్‌క్రాస్ రక్తనిధి సిబ్బంది, రెడ్‌క్రాస్ సభ్యులు, రెడ్‌క్రాస్ యోగా కేంద్రం సభ్యులు రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, యోగా కేంద్రం కన్వీనర్ హరినారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● బిట్రగుంట : దివంగల మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాంను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని న్యాయవాది ఏపీ బీసీ న్యాయవాదుల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఇర్ల వెంకటరమణయ్య తెలిపారు. విశ్వనాథరావుపేట పంచా యతీ ఇబ్రహీం పేటలోని కలాం విగ్రహా నికి పూల మాలు వేసి నివాళుల ర్పిం చారు. బహుముఖ ప్రజ్ఞా శాలి, రచయత, గొప్ప శాస్త్రవేత అబ్దుల్ కలాం భారతీయుడు కావడం మనం చేసుకున్న అదృష్టమని బిట్రగుంట రైల్వే అభి వృద్ధి కమిటీ అధ్యక్షుడు షేక్ నూరుద్దీన్ చెప్పారు. చంద్ర, రాజేష్, షకీల్, ఓంశ్రీనాయుడు, బాషా, రవి పాల్గొన్నారు.



బిట్రగుంట: పూలమాల వేస్తున్న వెంకట రమణయ్య

పంచాయతీల అభివృద్ధికి నిధుల మంజూరు : కాకర్ల



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల



శిలాఫలకం ఆవిష్కరణలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి

వరికుంటపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం రూ. 2.36కోట్ల నిధులను మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. మంగళవారం టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లె పండుగలో భాగంగా నార్తుకొండాయపాళెం, ఎస్సీకాలనీల్లో రూ. 8.40లక్షలు, కనియంపాడులో రూ. 7లక్షలతో నిర్మించే సిమెంట్ రోడ్లకు శిలాఫలకాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యంగా మారిందన్నారు. త్వరితగతిన పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేయించి తాగు, సాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. వైసీపీ నాయకుల చేతుల్లో భూములు కోల్పోయిన బాధితులకు న్యాయం చేస్తానని హామీనిచ్చారు. అనంతరం నార్తుకొండాయపాళెం ఎస్సీ కాలనీలో తెలుగు యువత నేత ముజ్జె లక్ష్మీనారాయణ సొంత నిధులతో నిర్మించిన వాటర్‌ప్లాంటును ప్రారంభించారు. తొలుత ఛత్రపతి శివాజీ, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దారకానిపాడు, దప్పళంపాడులో..

గుడ్లూరు: దారకానిపాడు, దప్పళంపాడు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో శిలా ఫలకాలను ఆవిష్కరించారు. దారకానిపాడులో పంచాయతీ నుంచి బీసీ కాలనీలోకి రోడ్డు నిర్మాణానికి రూ.10.93లక్షలు, దప్పళంపాడులోని పనులకు రూ.10లక్షలు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. రానున్న రోజుల్లో మరిన్ని సీసీ రోడ్లను గ్రామాల్లో గుర్తించి, ఎక్కడ మట్టిరోడ్లు లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా డ్వామా పీడీ గంగాభవాని, కందుకూరు ఏపీడీ బాబురావు, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, తహసీల్దారు స్వర్ణ, హౌసింగ్ ఏఈ వెంకటే శ్వర్లు, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, టీడీపీ మండలాధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, పువ్వాడి వేణుగోపాల్, మేకపోతుల రాఘవులు, జంపని ప్రసాద్, జనసేన నాయకులు సన్నిశెట్టి గిరిబాబు పాల్గొన్నారు.

గొర్రెల దొడ్డిగా బల్క్‌మిల్క్ భవనం



కూనిపాలెంలో ఊరికి దూరంగా బల్క్ మిల్క్ సెంటరు నిర్మాణం చేపట్టారు. నిధులు లేక పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. వీటిని గ్రామస్థులు గొర్రెలు దొడ్డి ఏర్పాటు చేశారు. మరికొంతమంది ఇందులో వ్యవసాయ పనిముట్లు వేసుకున్నారు. అంతేగాకుండా పొగాకు సీజన్‌లో పొగాకు నిల్వ చేస్తున్నారు. మహిళా సాధికారతను బలోపేతం చేసేందుకు గత వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లో పాలవెల్లువ కేంద్రా లను నిర్మించింది. అయితే కేంద్రాలకు పూర్తిస్థా యిలో బిల్లులు చెల్లించకపోవంతో గుత్తేదార్లు పాలవెల్లువ కేంద్రాల పనులు నిలి పివేశారు. సంబంధిత అధికారులు స్పందించి వీటి నిర్మా ణాలను పూర్తిచేసి వినియోగంలోకి తీసుక రావాలని కోరుతున్నారు.

- వలేటివారిపాలెం

వెన్నెముకపై శ్రద్ధ తీసుకోవాలి

నెల్లూరు వైద్యం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వెన్నెముక ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మెడికవర్ ఆసుపత్రి వెన్నెముక వైద్య నిపుణుడు డాక్టర్ గంగపట్నం దినేష్ సూచించారు. మంగళవారం ప్రపంచ వెన్నెముక దినోత్సవ ముందస్తు అవగాహన కార్యక్రమం ఆసుపత్రిలో జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 100 కోట్ల మంది వెన్నెముక సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని చెప్పారు. క్రమం తప్పకుండా వ్యాయామం, సరైనా ఆహారం, నిద్ర వంటి వాటిని అనుసరిస్తే వెన్నును ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని తెలిపారు. ఎక్కువగా మొబైల్ చూడటం, కంప్యూటర్ వాడకం వంటి వాటివల్ల వెన్నెముక సమస్యలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, పలువురు వ్యాధిగ్రస్తులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

న్యూస్ బాక్స్

రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో సర్వేపల్లి విద్యార్థినికి ద్వితీయ స్థానం

నెల్లూరు విద్య, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వారధి ఫౌండేషన్ ఆన్‌లైన్ ద్వారా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, చర్చా పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. సర్వేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల 10వతరగతి విద్యార్థిని బి సంయుక్త వ్యాసరచనలో ద్వితీయస్థానం సాధించింది. చర్చావేదిక పోటీల్లో పొదలకూరు జడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన కే సుమన్ సాయి, చరిత, టీ తేజస్విని, ఏ సృజన ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. ఆయా విద్యార్థులను మంగళవారం డీఈవో రామారావు, ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి ప్రత్యేకంగా అభినందించారు.

ఇసుక డంపింగ్ యార్డుకు స్థల పరిశీలన

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడలో ఇసుక డంపిగ్‌యార్డుకోసం తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు స్థలాలను పరిశీలించారు. జొన్నవాడలోని చెత్త సంపద కేంద్రం వద్ద స్థలాన్ని, గానేరుగంట వద్ద స్థలాన్ని, ప్రభుత్వాసుపత్రి పక్కన ఉన్న స్థలాన్ని మండల, గ్రామ సర్వేయర్లు శ్రీనివాసులు, సాయితో కలిసి పరిశీలించారు. చెత్త సంపద కేంద్రం వద్ద డంపింగ్ యార్డుకు అనువైన ప్రదేశంగా తెలిపారు.

నేత్రదానం

విడవలూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విడవలూరు జాన్‌పేటకి చెందిన ఎల్లు వెంకయ్య(52) మంగళవారం అకస్మికంగా మృతి చెందారు. అయన నేత్రాలను మన సేవా సంస్థ సహకారంతో కుటుంబసభ్యులు దానం చేశారు. మృతుడి నేత్రాలను నెల్లూరు మోడరన్ ఐ ఆసుపత్రి టెక్నీషియన్ వేణు సేకరించారు.

ఆటో ఢీకొని ఒకరికి గాయాలు

వెంకటాచలం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిక్కవరప్పాడు సమీపంలో మంగళవారం ఆటో ఢీకొనడంతో ఒకరు గాయపడ్డారు. వివరాలమేరకు.. సర్వేపల్లి గ్రామానికి చెందిన టీ వెంకయ్య మోటర్ బైక్‌పై వస్తుండగా ఆటో ఢీకొంది. దీంతో వెంకయ్యకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆంజనేయస్వామి జన్మనక్షత్రం పూర్వాభాద్ర ఆయనకు ప్రీతిపాత్రమైన మంగళవారం రావడంతో నగరంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. శబరి శ్రీరామక్షేత్రం, పప్పులవీధి ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేష కార్యక్రమాలు నిర్వహించారు. సింధూరం, తమలపాకులు, ఎర్రని పుష్పాలతో అర్చించారు. సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

త్రయోదశి ప్రదోషకాల పూజలు

నెల్లూరు సాంస్కృతికం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శివాల యాల్లో మంగళవారం త్రయోదశి సందర్భంగా సాయంత్రం ప్రదోషకాల అభిషేకాలు, పూజలు జరిగాయి. మూలస్థానేశ్వరస్వామి ఉస్మాన్‌సాహెబ్‌పేట కాశీవిశ్వనాథస్వామి, రాజరాజేశ్వరి ఆలయంలోని సుందరేశ్వర స్వామి, అష్టలక్ష్మీ ఆలయంలోని ఉమా మహేశ్వరస్వామి ఆలయాల్లో పరమేశ్వరుడికి, నందీశ్వరుడికి విశేష ద్రవ్యాలతో అభిషేకాలు, పూజలు జరిగాయి. మూలస్థానేశ్వర ఆలయంలో ప్రదోషకాల పూజల అనంతరం వెండి నందిపై శివపార్వతులకు ప్రాకారోత్సవం జరిగింది.

అనువైన వంగడాలు సాగు చేయాలి

తోటపల్లిగూడూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్‌కు అనువైన వంగడాలను రైతులు సాగు చేసుకోవాలని ఏడీఏ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని ముంగలదొరువులో మంగళవారం రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు వాడి నేలను సారవంతం చేసుకోవాలని ఆయన వివరించారు.

జోరు వాన


నగరంలో కురుస్తున్న వర్షం

- రెండో రోజూ భారీ వర్షం
- అండర్‌బ్రిడ్జిల్లో నిలిచిన నీళ్లు
- వాహన రాకపోకలకు తీవ్ర ఆటంకం
- డ్రైనేజీతో కలిసి పారిన వర్షపునీరు

నెల్లూరు సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడటంతో రెండవ రోజు మంగళవారం కూడా నెల్లూరు నగరంలో జోరున వర్షం కురిసింది. దీంతో నగరంలోని రోడ్లు, కూడళ్లు, లోతట్టు ప్రాంతాలు, ఖాళీ స్థలాలు జలమయమయ్యాయి. పలుచోట్ల కాలువల్లోని మురుగు వర్షపు నీటితో కలిసి రోడ్లపై ప్రవహించింది. ప్రధానంగా గాంధీబొమ్మ, వీఆర్సీ, మద్రాసు బస్టాండ్, ఆర్టీసీ, కేవీఆర్, మాగుంటలేఅవుట్, వనంతోపు, వేదాయపాళెం కూడలి, వాకర్స్‌రోడ్డు, సంతపేట ప్రాంతాల్లో వర్షపు నీరు భారీగా చేరింది. విజయమహల్ గేట్, మాగుంట లేఅవుట్, ఆత్మకూరు బస్టాండ్, రామలింగాపురం ప్రాంతాల్లోని అండర్‌బ్రిడ్జీలు నీట మునగడంతో వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలిగింది. భారీ వర్షాల వల్ల కూలీలు, చిరు వ్యాపారులు ఉపాధిని కోల్పోయి ఇళ్లకే పరిమితమయ్యారు. విద్యాలయాలకు ముందుగానే సెలవు ప్రకటించ డంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఊరట చెందారు.


ట్రంకురోడ్డుపై నిలిచిన వర్షపునీరు


తల్పగిరి కాలనీలో రోడ్డుపై పారుతున్న వాననీళ్లు

అప్రమత్తంగా ఉండాలి

- దేవదాయశాఖ జిల్లా ఏసీ జనార్దన్‌రెడ్డి

నెల్లూరు సాంస్కృతికం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఆలయాల అధికారులు, సిబ్బంది తుఫాన్ కారణంగా అప్రమత్తంగా ఉండాలని దేవదాయ ధర్మదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు సూచనలు చేశారు. పురాతన ఆలయాలు, సత్రాల వద్దకు ప్రజలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ధ్వజస్తంభాలు, ఆలయాల పరిస రాల్లో హోర్డింగ్‌లు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎప్పటిక ప్పుడు సమాచారాన్ని జిల్లా కార్యాలయానికి చేరవేయాలని ఆదేశించారు.

అప్రమత్తమైన యంత్రాంగం

- కాలువల్లో ముమ్మరంగా పూడికతీత
- భారీ వృక్షాలకు కొమ్మల తొలగింపు
- నగరంలో 13 పునరావాస కేంద్రాలు
- లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

నెల్లూరు సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు, వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో నెల్లూరు నగర పాలక సంస్థ యంత్రాంగం అప్రమత్తమైంది. ఎటువంటి విపత్తునైనా తట్టుకునేందుకు తగు వనరులను సిద్ధం చేసుకుంటోంది. కమిషనర్ సూర్యతేజ నగరంలోని కాలువల్లో పూడిక తీత పనులను ముమ్మరం చేయించారు. భారీ వృక్షాలకు కొమ్మలు తొలగింపజేస్తున్నారు. వరద నీరు ప్రవహించే ప్రధాన కాలువల గట్లపై నిర్మించిన తాత్కాలిక ఇళ్లను తొలగిస్తున్న సిటీ ప్లానింగ్ అధికారులు ఆక్రమణల తొలగింపునకు సిద్ధమయ్యారు.

నగరంలోని అండర్‌బ్రిడ్జీల వద్ద మంగళవారం భారీ మోటార్లను డంప్ చేసిన ఇంజనీరింగ్ అధికారులు వర్షం కురవడంతో వచ్చిన నీటిని వచ్చినట్లు బయటకు తోడేస్తున్నారు. మాగుంట లేఅవుట్ వద్ద కాలువల తూముల్లో పూడిక తొలగించి నీళ్ల బయటకు సులువుగా వెళ్లేందుకు దారులు ఏర్పాటు చేశారు. వెంకటేశ్వరపురం, గాంధీగిరిజనకాలనీ, కొత్తూరు, కల్లూరుపల్లి, కనుపర్తిపాడు, అయ్యప్పగుడి, బుజబుజనెల్లూరు ప్రాంతాల్లో లోతట్టు నివాసాల వద్దకు చేరుతున్న నీటిని బయటకు తోడుతున్నారు. ఎంజీమాల్ వద్ద కాలువల్లో పూడికతీసేందుకు భారీ ర్యాంపులను పగలుకొట్టారు. పొగతోటలోని డ్రైనేజీ కాలువలపై ఉన్న సిమెంట్ పలకలను ఎక్స్‌కవేటర్ల సహాయంతో బయటకు తీశారు. మన్సూర్‌నగర్, పత్తేఖాన్‌పేట తదితర ప్రాంతాల్లోని భారీ వృక్షాలకు కొమ్మలను తొలగించారు.


చెట్ల కొమ్మల తొలగింపును పరిశీలిస్తున్న నగర కమిషనర్ సూర్యతేజ

- భారీ వర్షసూచన ఉండటంతో లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు కార్పొరేషన్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 13 పునరావాస కేంద్రాలను అందుబాటులో ఉంచాలని కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కేంద్రాలకు వచ్చే ప్రజలకు ఆహారం, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, చిన్నపిల్లలకు పాలు, దుప్పట్లు వంటి కనీస సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. కాగా, నెల్లూరులోని ప్రజలకు భారీ వర్షాల కారణంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నెంబర్లు 0861-2356777, 2316777లకు సమాచారం అందించాలని కోరారు.

కోవూరులో కుండపోత వర్షం

కోవూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావం వల్ల మంగళవారం ఉదయం మండల పరిధిలోని గ్రామాల్లో కుండపోత వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి వాతావరణంలో మార్పు కన్పించింది. మబ్బులున్నప్పటికీ చినుకులు పడలేదు. పాఠశాలలు, కళాశాలలకు సెలవులివ్వడంతో మూతపడ్డాయి. తహసీల్దారు నిర్మలానందబాబా రెవెన్యూ సిబ్బందితో ఫోనులో గ్రామాల్లో పరిస్థితులపై ఎప్పటికప్పుడు తెలుసుకున్నారు. నిత్యావసర సరకులను పౌరసరఫరాల శాఖాధికారులు డీలర్ల వద్దకు చేర్చారు. భారీ వర్షాల వల్ల ఎలాంటి విపత్కర పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు విద్యుతుశాఖ కంట్రోలు రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే మధుసూదనరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే రమేష్ చౌదరి తెలిపారు. కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, ఇందుకూరుపేట, విడవలూరు, కొడవలూరు, సంగం మండలాల్లో విద్యుతు సరఫరాలో అంతరాయం కలిగితే కంట్రోల్ రూమ్ 9705200708కు తెలియచేయాలని కోరారు.


కోవూరులో కురుస్తున్న వర్షం

నేలకొరిగిన చెట్ల తొలగింపు

కొడవలూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మపాళెం పంచాయతీ చంద్రశేఖరపురంలో తుపాను ప్రభావంతో సోమవారం కురిసిన భారీ వర్షానికి నెలకొరిగిన చెట్లును మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో తొలగింపజేశారు. అలాగే కాలువల్లో నీరు సక్రమంగా ప్రవహించేలా పూడిక తీయించారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు నాపా వెంకటేశ్వర్లు నాయుడు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి, పేదల సంక్షేమం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితోనే సాధ్యమని అన్నారు. తుపానుతో ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు స్ఫూర్తిరెడ్డి, నాయకులు కిషోర్ నాయుడు, సంజీవరావు, కరుణాకరణ్, ఏసోబ్ తదితరలు పాల్గొన్నారు.


ఎక్స్‌కవేటర్‌తో పనులు చేయిస్తున్న అధికారులు

తుఫాన్ ప్రభావంపై కరపత్రాల పంపిణీ

విడవలూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడి తుపానుగా మారే అవకాశాలు ఉన్నందున కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాల మేరకు గిరిజనుల్లో, మత్స్యకారుల్లో అవగాహన కల్పిస్తూ టీడీపీ నాయకుడు ఆవుల వాసు కరపత్రాలను పంపిణీ చేశారు. రామచంద్రాపురం, రామతీర్థం పంచాయతీల్లో అయన మంగళవారం పర్యటించారు. తుపాను ప్రభావం తగ్గేంత వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు శ్రీహరికోట గోపి, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిలో 115.02 మి.మీ వర్షం

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు 115.02 మి.మీ వర్షం కురిసింది. సాయంత్రం వరకు ఎండకాసి 5గంటల నుంచి మళ్లీ వర్షం మొదలైంది. కాగా తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శ్రీహరి, సీఐ శ్రీనివాసులురెడ్డి, తదితరులు మండలంలోని పెన్నాపరివాహక ప్రాంతాలైన మినగల్లు, జొన్నవాడ, శ్రీరంగరాజుపురం, దామరమడుగు, పల్లిపాళెంతోపాటు పలు లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తుపాను ప్రభావంను బట్టి లోతట్టు, పెన్నా తీర ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు సిద్ధంగా చేసినట్లు తెలిపారు. అలాగే బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని లోతట్టు ముంపు ప్రాంతాల్లో నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి పర్యటించారు. అత్యవసర పరిస్థితుల్లో నగర పంచాయతీ సిబ్బంది అందుబాటులో ఉండేలా కాల్‌సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

తిప్పవాగును పరిశీలించిన అధికారులు

పొదలకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఆల్తుర్తి గ్రామం వద్ద తిప్పవాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ నేపథ్యంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా మంగళవారం పొదలకూరు సీఐ రాంబాబు, ఎస్ఐ హనీఫ్, స్థానిక అధికారులు, నాయకులతో కలిసి వాగును పరిశీలించారు. వాగుకు రెండువైపులా రాకపోకలు సాగకుండా ముళ్లకంచె వేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ వర్క్‌ఇన్‌స్పెక్టర్ రియాజ్, పంచాయతీ సెక్రటరీ సురేష్, టీడీపీ నాయకులు ఉప్పలమర్రి ప్రభాకర్‌రెడ్డి, ఉప సర్పంచు ఖాదర్‌బాషా పాల్గొన్నారు.


ఆల్తుర్తి తిప్పవాగును పరిశీలిస్తున్న అధికారులు

వెంకటాచలంలో ఎడతెరిపిలేని వర్షం

వెంకటాచలం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం కారణంగా మంగళవారం సాయంత్రం మండలంలో ఎడతెరిపిలేని వర్షం కురిసింది. అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. కొన్ని గ్రామాల్లో చెరువులు వర్షపునీటితో నిండు కుండల్లా మారాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచి ప్రజలు కొంత ఇబ్బంది పడ్డారు. ఆయా గ్రామాల్లో స్థానిక అధికారులతో కలిసి కూటమి నేతలు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. కాగా, మండలంలోని కసుమూరు పంచాయతీ కొండమీద ఉన్న గిరిజనులను సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు పరామర్శించారు. గిరిజనుల ఇబ్బందులు, వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గుమ్మినేని వాణిభవానినాయుడు, బుర్ర శ్రీను తదితరులున్నారు.

ఈదురు గాలులు, ఉరుములతో జనం బెంబేలు

మనుబోలు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వీటికి ఈదురుగాలులు, ఉరుములు తోడవడంతో జనం బెంబేలెత్తారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో కొలనుకుదురులో ఉన్న తుఫాన్‌షెల్టర్‌ను మంగళవారం తహసీల్దారు సుబ్బయ్య పరిశీలించారు. గ్రామంలో లోతట్టు కాలనీవాసులతో మాట్లాడారు. అలాగే మనుబోలు, పలు గ్రామాల్లోని వంతెనలను, చెరువుకట్టలను సీఐ రాంబాబు, ఎస్ఐ శివరాకేష్ పరిశీలించారు. మరో రెండు రోజులు వర్షాలు ఉన్నాయని, అప్రమత్తంగా ఉండాలని అధికారులు, పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు.

సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా రాములు నాయక్

నెల్లూరు క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా రాములు నాయక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ, ఇతర అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, రాములు నాయక్‌కు గత వైసీపీ ప్రభుత్వంలో మాజీ మంత్రి అనిల్‌కు నీడ అనే పేరు ఉంది. అప్పట్లో టీడీపీ నేత అబ్దుల్ అజీజ్‌పై బాలాజీనగర్ పోలీసు స్టేషన్‌లో ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశారు. అలాగే కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డితో పలుమార్లు వివాదాలు పెట్టుకొని వార్తల్లో నిలిచారు.

వైద్య బృందం అప్రమత్తంగా ఉండాలి

- జగదేవిపేట పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో


వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

ఇందుకూరుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నందున వైద్య బృందం అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య ఆదేశించారు. మంగళవారం ఆయన జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఎమరెన్సీ మెడికల్ టీం వివరాలు తెలుసుకున్నారు. అందుబాటులో ఉంచిన అత్యవసర మందులు, నాలుగు రోజుల్లో డెలివరీ కానున్న గర్భిణుల వివరాలు వెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి హెడ్ క్వార్టర్‌లో ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు తుపాన్ షెల్టర్స్‌లో ఉన్న ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తూ అత్యవసర వైద్య సేవలు అందించేలా అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ బ్రహ్మేశ్వర్‌నాయుడు, జిల్లా ఎపిడిమిక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రమోద్, హెచ్‌ఈవో శ్రీనివాసులు, సీసీ సాయిరాం కిషోర్, ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎల్‌డీ కంప్యూటర్ మహేష్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతో వ్యాధులు దూరం

- సెట్నల్ సీఈవో శ్రీనివాసరావు, డాక్టర్ విద్య


చేతులు శుభ్రం చేసుకునే విధానాన్ని వివరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు వైద్యం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : చేతుల పరిశుభ్రతతో చాలా రకాల వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని సెట్నల్ సీఈవో శ్రీనివాస రావు సూచించారు. మంగళవారం పీహెచ్‌పీ ఆధ్వర్యంలో నగరంలోని శేషయ్య ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం జరిగింది. సీఈవో మాట్లాడుతూ అంటువ్యాధులు రాకుండా చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అలన్ రాయల్ దంతవైద్యశాల వైద్యురాలు డాక్టర్ ఊటుకూరు విద్య, పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ షేక్ రసూల్, విశ్రాంత ఏఎస్ఐ మహబూబ్‌బాషా, ఆసుపత్రి కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ పాల్గొన్నారు.

60 శాతం వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చు

చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవటం ద్వారా విరోచనాలు, డయేరియా వంటి 60 శాతం వ్యాధుల నుంచి బయట పడవచ్చని నారాయణ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. ఆసుపత్రిలో గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ చేతుల పరిశుభ్రతతో పిల్లల్లో 70 శాతం ఇన్ఫెక్షన్లు, జలుబు, శ్వాసకోశ సమస్యలు 20 శాతం నివారించుకోవచ్చని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సతీష్, డాక్టర్ లావణ్య, ఆపరేషన్స్ హెడ్ రామారావు, ఏజీఎం శేఖర్‌రెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ శ్రీవాణి పాల్గొన్నారు.

సైదాపురం(ఆంధ్రజ్యోతి) : మండల సమాఖ్య కార్యాలయంలో అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం, గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్, ఏపీఎం చంద్రశేఖర్, డీటీ అనురాధ, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

అబ్దుల్ కలామ్ జీవిత చరిత్ర మరువలేనిది

- వీఎస్‌యూ వీసీ సారంగం విజయభాస్కర్ రావు


అబ్దుల్ కలామ్‌కు నివాళులర్పిస్తున్న వీఎస్‌యూ వీసీ. తదితరులు

వెంకటాచలం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి, భారత రత్న డాక్టర్ ఏపీజే అబ్దు ల్ కలామ్ జీవిత చరిత్ర మరువలేనిదని విక్రమ సింహపురి యూనివర్శిటీ (వీఎస్‌యూ) వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు పేర్కొన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో మంగళవారం అబ్దుల్ కలామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కలామ్ ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చి శాస్త్రవేత్తగా మాత్రమే కాకుండా, రాష్ట్రపతిగా దేశానికి అనేక సేవలందించి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. నేటి విద్యార్థులు కలామ్ అడుగుజాడల్లో నడవాలన్నారు. కలామ్‌కు మిస్సైల్‌మాన్‌గా, ప్రజల రాష్ట్రపతిగా ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. కార్యక్రమంలో వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీత, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, డాక్టర్ మధుమతి, డాక్టర్ సుజాత, డాక్టర్ హనుమారెడ్డి, డాక్టర్ సాయినాథ్, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ శ్యామ్ సుందర్‌భగవాన్, డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

నెల్లూరు వెంకటేశ్వరపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా మంగళవారం వెంకటేశ్వరపురంలోని ప్రసాద్ విద్యాలయంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. వికలాంగుల ఐక్యసంఘం, బ్లాక్‌బోర్డు మిత్రమండలి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మిత్రమండలి అధ్యక్షుడు ప్రసాద్, సనావుల్లా, జకావుల్లా, అయేషా, ఆసిఫా పాల్గొన్నారు.

రూ.2 కోట్లతో 'పల్లె పండుగ'


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు


నెల్లూరు రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నెల్లూరు రూరల్లోని 18 గ్రామాల్లో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టబోతు న్నామని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని దేవరపాళెంలో రూ. 10 లక్షలతో నిర్మించబోయే డ్రైన్ పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ పల్లెపండుగ కార్యక్రమం వల్ల గ్రామాల్లోని ప్రజలకు కనీస అవసరాలు తీరుతాయన్నారు. సీసీ రోడ్లు, డ్రైన్లు వంటి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఎంపీపీ విజయకుమార్, ఎంపీడీవో శైలేంద్రకుమార్, వేదగిరి క్షేత్రం మాజీ ఛైర్మన్లు వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, నాయకులు వేమిరెడ్డి నారాయణరెడ్డి, బాబు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయుడికి వెండి సర్వాంగ కవచం బహూకరణ


వెండిసర్వాంగ కవచాన్ని బహూకరిస్తున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరులో సీతా లక్ష్మణ సమేత శ్రీకోదండ రామస్వామి ఆలయంలో కొలువైవున్న ప్రసన్నాంజనేయస్వామికి మంగళవారం దాతలు వెండి సర్వాంగ కవచం బహూకరించారు. ఈ కార్యక్రమంలో దాతలు అత్తిపల్లి క్రిష్ణమోహన్‌రెడ్డి, దువ్వూరు వెంకటకృష్ణారెడ్డి, బద్దిపూడి శ్రీనివాసులురెడ్డి, యేల్చూరి సురేష్, సరాబు సురేష్, పడిదం ప్రసాద్, సురేష్, రేబాల వెంకటక్రిష్ణారెడ్డి, యేటూరు గాయత్రి, తిరుపతి సుకుమార్, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

- ఐదు మండలాలకు పొంచి ఉన్న ముప్పు
- వాకాడులో పునరావాస కేంద్రాలకు తరలింపు
- జిల్లాలో 208 కేంద్రాల ఏర్పాటు



ఒకటే.. వాన



నేడు విద్యాసంస్థలకు సెలవు

భారీ వర్షాల నేపథ్యంలో బుధవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం తెలిపారు. సంబంధిత యాజమాన్యాలు విధిగా సెలవు పాటించాలన్నారు.



తిరుపతిలో రహదారులపై నిలిచిన నీరు



తూపిలిపాళెం పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న లోతట్టు ప్రాంత ప్రజలు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మూడురోజులుగా మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఉదయం నుంచి మోస్తరు పాటి వర్షం నిరంతరంగా కురవగా.. రాత్రి 7 గంటలు దాటాక భారీ వర్షంగా మారింది. పలు మండలాల్లో కరెంటు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముంపు ప్రాంతాల్లోని ప్రజల కోసం ముందస్తుగా అధికారులు 208 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాకాడు, చిల్లకూరు, కోట, తడ, గూడూరు, బీఎన్‌కండ్రిగ, దక్కిలి ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదైంది. ఇక సముద్ర తీర ప్రాంత మండలాలైన చిల్లకూరు, వాకాడు, కోట, తడ, సూళ్లూరుపేటలో భారీ వర్షపాతం నమోదైన నేపథ్యంలో పోలీసు, రెవెన్యూ యంత్రాంగం సహాయక చర్యలకు సిద్ధమైంది. వాకాడు మండలం తూపిలిపాళెం ఎస్టీకాలనీ వాసులను ప్రభుత్వ పాఠశాలలోని పునరావాస కేంద్రానికి తరలించారు. మిగతా మండలాల్లోని ప్రజలను రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తం చేస్తూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలని విజ్ఞప్తి చేస్తోంది. మరోవైపు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను గూడూరు ఆర్డీవో కార్యాలయానికి తరలించారు. బుధ, గురువారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూముకు (ఫోను నెంబరు: 0877-2236007)లేదా ఆయా రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లోని కంట్రోల్‌రూమ్‌లకు సమాచారం ఇవ్వాలని అధికారులు తెలిపారు.

వాకాడులో తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్న ఎంపీడీవో అన్నపూర్ణరావు



వానొస్తే ఇంతే

వర్షమొస్తే చాలు.. ఇలా వాగులో శవంతో సాహస యాత్ర చేయాల్సిందే. నాగలాపురం మండలం సురుటుపల్లె పంచాయతీ కస్తూరినాయుడు కండ్రిగ ప్రజలకు ఏటా ఇదో బాధాకర అనుభవంగా మారుతోంది. తుఫాన్ నేపథ్యంలో అరుణానదికి సంబంధించిన కాలువకు నీళ్లు రావడంతో మంగళవారం శంకర్(53) మృతదేహాన్ని నడుము లోతు నీటిలో ఇలా తీసుకెళ్లారు. వంతెన ప్రతిపాదన కార్యరూపం దాలిస్తేకానీ, వీరికి ఈ సమస్య తీరదు మరి.

- నాగలాపురం, ఆంధ్రజ్యోతి



అవసరమైతే తప్ప ప్రయాణాలు వద్దు

భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయొద్దని కలెక్టర్ వెంకటేశ్వర్ విజ్ఞప్తి చేశారు. కాజ్‌వేలు, వంకల్లో నీరు ప్రవహిస్తున్న సమయంలో ప్రయాణం వద్దన్నారు. ప్రాణ.. ఆస్తి నష్టం లేకుండా ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.

జూపార్కులో జంతువులకు ప్రమాదం లేదు

మంగళం, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ఎస్వీ జూపార్కులోని ఎన్‌క్లోజర్‌లో ఉండే జంతువులకు ఎలాంటి ప్రమాదం లేదని క్యూరేటర్ సెల్వం తెలిపారు. గతంలో భారీ వర్షాలకు ఎన్‌క్లోజర్‌లో వరదనీరు చేరి జంతువులకు ఇబ్బంది కలిగేదని గుర్తుచేశారు. ఆ సమస్య పునరావృతం కాకుండా డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేశామన్నారు. జంతువుల రక్షణకు అన్ని చర్యలు తీసుకోవడంతో ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు.

సహాయక చర్యలకు మేము సిద్ధం


తిరుపతి (జీవకోన), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో తక్షణ సహాయక చర్యలకు తాము సిద్ధంగా ఉన్నట్లు జిల్లా రవాణాశాఖ అధికారి మురళీమోహన్ మంగళవారం తెలిపారు. వాకాడు, తూపిలిపాళెం, చిల్లకూరు, నాయుడుపేట వంటి ప్రాంతాల్లో రవాణాశాఖ అధికారులను ఇప్పటికే అప్రమత్తం చేయడంతో పాటు అక్కడ ఎక్స్‌కవేటర్లు, క్రేన్లు, స్కూల్, కళాశాలల బస్సులను అందుబాటులో ఉంచామన్నారు. వరదలు ఎక్కువైతే ఎక్స్‌కవేటర్ల ద్వారా గట్లను తొలగించడం.. క్రేన్ల ద్వారా బోట్లను ఇతర ప్రాంతాలకు తరలించేలా ఏర్పాట్లు చేశామన్నారు. వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టడానికి నలుగురు ఎంవీఐలను అందుబాటులో ఉంచామన్నారు.



గూడూరులో స్టేడియంలో నిలిచిన వర్షపునీరు

జిల్లావ్యాప్తంగా మద్యం దుకాణాల కేటాయింపుల వెనుక సిండికేట్లు కీలక పాత్ర వహిస్తున్నాయి. కొన్ని చోట్ల ముందుగానే గ్రూపులుగా ఏర్పడి దరఖాస్తులు వేయగా.. మరికొన్ని చోట్ల షాపులు ఖరారయ్యాక సిండికేట్లు ఏర్పాటవుతున్నాయి. పలు నియోజకవర్గాల్లో అధికార పార్టీ ముఖ్యనేతలు తెర వెనుక ఉండి మంత్రాంగం నడిపిస్తుండగా తెర ముందు మాత్రం స్థానిక ద్వితీయ శ్రేణి నాయకుల హడావిడి కనిపిస్తోంది. సిండికేట్లతో సంబంధం లేకుండా షాపులు దక్కించుకున్న వారికి బెదిరింపులు, ఒత్తిళ్లు వస్తున్నాయి. నియోజకవర్గాల వారీగా సిండికేట్ల తీరుపై 'ఆంధ్రజ్యోతి' పరిశీలనాత్మక కథనం.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



మళ్లీ తయార్! సిండికేటుగాళ్లు

పాకాలలో బెదిరింపులు

చంద్రగిరి నియోజకవర్గం.. పాకాల మండలంలో ఐదు షాపులు వుండగా టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 25 మంది గ్రూపుగా ఏర్పడి దరఖాస్తులు వేశారు. వారికి మూడు షాపులు దక్కాయి. మరో రెండు ఇతరులకు ఖరారయ్యాయి.స్థానిక టీడీపీ నేతలు కొందరు ఆ షాపుల యజమానులను బెదిరించి దౌర్జన్యంగా షాపులు లాక్కొనేందుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.ఈ ఒత్తిళ్లతోనే ఒక దుకాణానికి లైసెన్సు ఫీజు కట్టలేదని తెలుస్తోంది. చంద్రగిరి మండలంలో ఏడు షాపులూ టీడీపీ వారికి దక్కగా.. అందులో ఒకదానిలో వైసీపీ వారూ భాగస్వాములని సమాచారం. టీడీపీకి చెందిన 35 మంది సిండికేట్‌గా ఏర్పడి దరఖాస్తులు చేయగా ఏడింటిలో ఒక షాపే వచ్చిందని సమాచారం.తిరుపతి రూరల్ మండలంలో 12షాపుల్లో ఎక్కువ భాగంగా వైసీపీ వారికి దక్కినట్టు తెలిసింది. అధికార పార్టీకి చెందిన ఓ యువనేత సుమారు 50 దరఖాస్తులు వేయిస్తే ఒక్కటీ రాలేదని చెబుతున్నారు.ఇక్కడా షాపులు తమకే ఇచ్చేయాలని అధికార పార్టీ ద్వితీయ శ్రేణి నేతలు బెదిరింపులకు దిగుతున్నట్టు ఆరోపణలున్నాయి.

వెంకటగిరిలో టీడీపీ- వైసీపీ 'మద్యం దోస్తీ'

వెంకటగిరి మండలంలో మద్యం దుకాణాల కోసం టీడీపీ-వైసీపీ నేతల మధ్య దోస్తీ కుదిరింది. తొమ్మిది షాపుల కోసం మూడు గ్రూపులుగా తయారై.. మూడేసి చొప్పున దక్కించుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. ముఖ్యనేతకు షాపుల నుంచీ వాటాతో పాటు ముఖ్య అనుచరులకు భాగస్వామ్యం కల్పించేలా ఒప్పందం ఖరారైనట్టు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దక్కిలి మండలంలో మూడు షాపులుంటే రెండు వైసీపీ వారికి దక్కినా అందులో టీడీపీ ముఖ్యనాయకులకు వాటా ఉన్నట్లు సమాచారం. మరొకటి టీడీపీ వారికి దక్కింది. బాలాయపల్లి మండలంలో రెండు వైసీపీ.. ఒకటి టీడీపీ వారికి వచ్చిందని సమాచారం. ఈ నియోజకవర్గంలోని షాపులన్నీ సిండికేట్ తరహాలో నడిపేందుకు ఓ పారిశ్రామికవేత్త యత్నిస్తున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

గూడూరులో ఎక్కువ అధికార పార్టీ వారికే!

గూడూరు నియోజకవర్గంలో 33 షాపులకుగాను 29 అధికారపార్టీకి చెందిన వారికే వచ్చాయి. రెండు వైసీపీ సానుభూతిపరులకు, ఒకటి తటస్థుడికి వచ్చాయి. మండల స్థాయిలో సిండికేట్లుగా ఏర్పడి దరఖాస్తు చేశారు. ఇక్కడా వెంకటగిరిలో జోక్యం చేసుకుంటున్న పారిశ్రామికవేత్త పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. కోట మండలంలోని ఏడు షాపులూ టీడీపీ వారికే దక్కగా, సిండికేట్ ఏర్పరిచేందుకు ముఖ్యనేత గూడూరుకు పిలిపించి సమావేశం పెట్టారని సమాచారం. వాకాడు మండలంలో నాలుగు షాపులూ టీడీపీ వారికే వచ్చాయి. సిండికేట్‌గా ఏర్పడే దరఖాస్తు చేశారు. ఇటీవల వైసీపీకి రాజీనామా చేసిన ఓ నాయకుడు కూడా ఒక మద్యం షాపులో భాగస్వామిగా వున్నట్టు ప్రచారం జరుగుతోంది. చిట్టమూరు మండలంలో రెండు వైసీపీ వారికి, మిగిలిన రెండు ఇతరులకు దక్కాయి.

సూళ్లూరుపేటలో 'టెన్ పర్సెంట్'

సూళ్లూరుపేట నియోజకవర్గంలో 38 షాపలోట్ల టీడీపీ వారికే అత్యధికం దక్కాయి. వైసీపీ నేతలకు మూడు వచ్చాయి. తటస్థులకు కూడా కొన్ని ఖరారయ్యాయి. సూళ్ళూరుపేట, నాయుడుపేట సర్కిళ్ళ పరిధిలో సిండికేట్ల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇక్కడ కూడా వెంకటగిరి, గూడూరు తరహాలోనే ఆ పారిశ్రామికవేత్త పేరు ఎక్కువగా ప్రచారంలో ఉంది. దానికి తోడు ఓ ముఖ్యనేత సోదరుడికి అన్ని షాపుల్లో పది శాతం వాటా చెల్లించేలా ఒత్తిళ్లు వస్తున్నట్టు సమాచారం. కొందరు టీడీపీ నేతలు ముందే గ్రూపుగా ఏర్పడి 30 షాపులకు దరఖాస్తు చేయగా ఒక్కటీ రాలేదు. తడ మండలంలో వైసీపీ వర్గీయులు గ్రూపుగా ఏర్పడి 15 షాపులకు దరఖాస్తు చేసినా ఒక్కటీ దక్కలేదు. నాయుడుపేటలో టీడీపీకి ఏడు, వైసీపీకి ఆరు చొప్పున వచ్చాయి. ఓజిలిలో రెండు షాపులనూ సిండికేట్‌గా ఏర్పడి స్థానిక టీడీపీ నాయకులు తీసుకున్నారని, దొరవారి సత్రం రెండు షాపులూ వైసీపీ వారికి దక్కాయని సమాచారం. నియోజకవర్గంలో ఇరు పార్టీల వారూ ఇప్పుడు కలసిపోయారని, 60 శాతం షాపులు సిండికేట్ నడిపించే పరిస్థితి కనిపిస్తోందని సమాచారం.

నోయిడా వాసులకు సత్యవేడులో మద్యం షాపులు

సత్యవేడు ప్రాంతానికి చెందిన పలువురు మద్యం షాపులకు దరఖాస్తు చేసి రూ.లక్షల్లో చేతి చమురు వదుల్చుకోగా ఎక్కడో ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాకు చెందిన ఇద్దరికి రెండు షాపులు దక్కడం గమనార్హం. సత్యవేడులోని షాపు నంబర్ 98 నోయిడాకు చెందిన సారికా గోయెల్‌కు, షాపు నంబరు 100 వత్సల్ గోయెల్‌కు దక్కాయి. వీరు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించారు. వీరెవరు, ఎవరి తరఫున మద్యం షాపులకు దరఖాస్తు చేశారన్నది ఇపుడు చర్చనీయాంశమైంది.

శ్రీకాళహస్తిలో సిండికేట్ల జోరు

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మద్యం దుకాణాల సిండికేట్లు జోరు మీదున్నాయి. శ్రీకాళహస్తి మండలంలో 12 షాపులకు ముందుగానే సిండికేట్‌గా ఏర్పడి టీడీపీకి చెందిన వారు షాపులన్నింటినీ దక్కించుకున్నట్టు సమాచారం. తొట్టంబేడు మండలంలోని మూడు.. ఏర్పేడు మండలంలో ఏడు షాపులూ టీడీపీవారికే దక్కాయి. ఏర్పేడులో టీడీపీ ముఖ్యనేత ప్రమేయంతో సిండికేట్‌గా దరఖాస్తుచేసి అన్నింటినీ దక్కించుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. రేణిగుంట మండలంలో ఆరు టీడీపీ,నాలుగు వైసీపీ వారికి వచ్చినట్టు తెలిసింది. నియోజకవర్గ వ్యాప్తంగా అధికార పార్టీకి చెందిన ముఖ్యనేత జోక్యం చేసుకుని సిండికేట్ ఏర్పాటు చేశారని చెబుతున్నారు.

తిరుపతిలోనూ సిండికేట్లదే హవా

తిరుపతి నగరంలో 32 షాపులకు 900కు పైగా దరఖాస్తులు వచ్చిన సంగతి తెలిసిందే. ఇక్కడ కూడా ముందుగానే కొందరు సిండికేట్‌గా ఏర్పడ్డారు. అధికార పార్టీ కీలక నేత తరఫున 30 మంది గ్రూపుగా ఏర్పడి ఏకంగా 350 దరఖాస్తులు వేశారని అయితే లాటరీలో కేవలం ఏడు షాపులు మాత్రమే దక్కాయని సమాచారం. ఆ గ్రూపులో వైసీపీకి చెందిన వారు కూడా వున్నట్టు ప్రచారం జరుగుతోంది. అలాగే మద్యం వ్యాపారంతో సంబంధం, అనుభవం వున్న వ్యక్తులు కొందరు బృందంగా ఏర్పడి 200 దరఖాస్తులు వేయగా కేవలం నాలుగు దుకాణాలే దక్కినట్టు సమాచారం. మొత్తం 32 షాపుల నిర్వహణనూ ఒకే గొడుగు కిందకు తెచ్చి సిండికేట్ తరహాలో మద్యం వ్యాపారం నడిపేందుకు తెర వెనుక యత్నాలు జోరుగా సాగుతున్నట్టు తెలిసింది.

రెండు మద్యం షాపులకు చెల్లించని లైసెన్సు ఫీజు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 227 మద్యం షాపులు దక్కించున్న వారిలో మంగళవారం సాయంత్రం వరకు 225 దుకాణాలకు మాత్రమే లైసెన్సు ఫీజు మొదటి కంతు చెల్లించారు. లైసెన్సులు దక్కించుకున్నారు. పాకాలలో 133వ దుకాణం, తొట్టంబేడులో దుకాణం నెంబరు 75ను దక్కించుకున్న వారు ఇప్పటి వరకు లైసెన్సు చెల్లించలేదు. 'వారికి ఇచ్చిన గడువు ముగిసిపోయింది. దీనిపై ఎక్సైజ్ కమిషనరు సంప్రదించి తదుపరి చర్యలు తీసుకుంటాం. ఆ రెండు దుకాణాలు రిజర్వులో ఉన్న వారికి కేటాయించడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది' అని ఈఎస్ నాగమల్లేశ్వరరెడ్డి తెలిపారు.

ఇక కొత్త లిక్కర్ షాపులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం నుంచి కొత్తగా ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభం కానున్నాయి. వైసీపీ హయాంలో ఏర్పాటైన ప్రభుత్వ మద్యం దుకాణాలు మంగళవారంతో మూత పడ్డాయి. సోమవారం లాటరీలో షాపులు దక్కించుకున్న వారు బుధవారం ఉదయం 10 గంటల నుంచి మద్యం దుకాణాలను ప్రారంభించుకోవచ్చు. వీటిని ప్రారంభించుకోవడానికి వారం రోజుల పాటు గడువు ఇచ్చారు. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు షాపులు తెరచి వుంటాయి. కాగా, చాలా చోట్ల ప్రభుత్వ మద్యం దుకాణాలున్న చోటే ప్రైవేటు దుకాణాల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారు.

సత్యవేడులో చేతులు కాల్చుకున్న దరఖాస్తుదారులు

వరదయ్యపాళెం మండలానికి చెందిన ఓ టీడీపీ నేత బీఎన్ కండ్రిగ మండల నాయకులతో కలసి 18 షాపులకు దరఖాస్తు చేయగా ఒక్కటీ రాకపోవడంతో రూ.36 లక్షలు నష్టపోయారని ప్రచారం జరుగుతోంది. మరో టీడీపీ నేత ఐదు షాపులకు రెండేసి చొప్పున పది దరఖాస్తులు వేస్తే ఒక్కటీ కూడా రాకపోవడంతో రూ.20 లక్షలు కోల్పోయినట్టు సమాచారం.

తీరు బాలేదు తమ్ముళ్లూ!



ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పార్టీ పరిస్థితిపై చంద్రబాబు అసంతృప్తి

చక్కదిద్దే పనిలో అధినేత 6లో

జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా అనగాని



తిరుపతి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ నియమితులయ్యారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు ఇంచార్జి మంత్రులను నియమించింది. అందులో భాగంగా తిరుపతి జిల్లాకు రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్‌ను కేటాయించింది. రెవెన్యూ శాఖ మంత్రిగా ఉన్న కారణంగా జిల్లాలోని భూ వివాదాలపై ఆయన దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకునే అవకాశముంది.

భలేభలే బజ్జీలు



6లో



'తడవబాకరా నాయనా.. తల తడిస్తే పడిసెం జేస్తాది' అని వానలో ఆడే పిలకాయల్ని అమ్మ మందలిస్తూ ఉంటుంది. వకుళమాత కోపం గుర్తుకొచ్చిందేమో మరి.. మంగళవారం సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవ ఊరేగింపు కోసం బయటకొచ్చిన స్వామి ఘటాటోపం కిందకి చేరుకున్నాడు. తల తడిస్తే పడిసెం మాకు మాత్రం పట్టదా అని ఏనుగులు మహాలక్ష్మి, పద్మజ కూడా పందిరి కిందకు చేరుకున్నాయి, తడవకుండా.

- తిరుమల,ఆంధ్రజ్యోతి



అర గంట నిలిచి కురిస్తే చాలు.. మాలాడగుండం దూకి పారుతుంది. కపిలతీర్థం కత చెప్పనే అవసరం లేదు. హోరెత్తుతుంది. రెండు రోజులుగా చిటుకూ పటుకూ మంటూనే ఉన్నా ఉలుకూపలుకూ లేకుండా ఉన్న మాలాడగుండంలో మంగళవారం సాయంత్రానికి సన్నని ధర మొదలైంది. చూరునీళ్లు కారినట్టుగా కనిపిస్తున్నా.. ఇదేవాన రాత్రికి కురిస్తే మాత్రం తెల్లారేసరికి ఉరకలెత్తి తిరుపతి నగరానికి కనువిందు చేస్తుంది.

- తిరుపతి,ఆంధ్రజ్యోతి



తిరుపతి మహానగరంగా మారిపోతున్నా.. శివారు ప్రాంతాలు మాత్రం పల్లె ఆచారాలను కాపాడుకుంటున్నాయి. జీవకోనలో ప్రతిఏటా జరిగినట్టే భారతాలు జరుగుతున్నాయి. జీవలింగేశ్వరస్వామి గుడిలో మంగళవారం గీతావాణి ఆడిపాడి చెప్పిన హరికథ జనాన్ని అలరించింది. ఈ నెల 27 దాకా మహాభారత ఉత్సవాలు ఇక్కడ ఘనంగా జరుగుతాయి.

-తిరుపతి (జీవకోన), ఆంధ్రజ్యోతి



మహాత్ముడి తర్వాత దేశ ప్రజలంగా ఆరాధించిన నేత ఏపీజే అబ్దుల్ కలాం. అంతరిక్ష ప్రగతిలో ఆయన పాత్ర గొప్పది. కలాం జయంతి సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు షార్ మాజీ డైరెక్టర్ పద్మశ్రీ కె. నారాయణ. ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు సూచిస్తూ మంగళవారం సూళ్లూరుపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

-సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

STREET FOOD

భలే భలే బజ్జీలు









ఇక్కడ దొరికే బజ్జీలు:

మిర్చి బజ్జీ, టమోటా, క్యాప్సికం, బీరకాయ, అరటికాయ, వంకాయ, ఉర్లగడ్డ, సీమవంకాయి, గెనిసిగెడ్డ, సొరకాయ, యాపిల్, జామ, పైనాపిల్, మామిడి కాయ.


ప్రత్యేకత: బజ్జీలకు సన్‌ఫ్లవర్ ఆయిల్ వాడుతారు. ఒక రోజు వాడిన నూనె మిగిలినా మరుసటి రోజుకి వాడరు.

ఎన్ని ఛాట్‌లు వచ్చినా మన బజ్జీని కొట్టే మొనగాడు ఫుడ్ లేదు. మరీ కాస్త చినుకు రాలి చల్లబడితే మనసు బజ్జీ మీదకు పోతుంది. మిర్చి బజ్జీ, అరటికాయ బజ్జీ, ఉర్లగడ్డ బజ్జీ.. మనకు తెలుసుగానీ 15 రకాల బజ్జీలు దొరికే ఒక చోటు తిరుపతిలో ఉంది. రాములవారి ఉత్తర మాడవీధిలో ఈ బజ్జీల బండి దగ్గర సాయంత్ర సమయాల్లో జనం కిటకిటలాడుతూ కనిపిస్తారు. మరిగే నూనెలోంచి కాలేకాలే బజ్జీలు ప్లేట్‌లో పెట్టి.. ఎండుమిరపకాయలు, అలసందలు, ధనియాలు, చెనిక్కాయ పప్పులతో కూడిన మసాలాను ఆ బజ్జీలలో కూరి ఇస్తారు. ఫైనల్ టచ్‌గా నిమ్మ దబ్బ పిండుతారు. సురేంద్ర ఆరేళ్లుగా ఈ బండి నిర్వహిస్తున్నారు.

- తిరుపతి (జీవకోన)

బండి సమయం: సాయంత్రం 4 నుంచి రాత్రి 9 దాకా

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి పట్ల చంద్రబాబు నాయుడు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యేలు, ఇతర నాయకుల తీరుపై సమాచారం తెప్పించుకుంటున్న ఆయన జిల్లాలో పార్టీ వ్యవహారాలను చక్కదిద్దడం మీద దృష్టి పెట్టినట్టు చెబుతున్నారు.



తీరు బాలేదు తమ్ముళ్లూ!

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పార్టీ పరిస్థితిపై చంద్రబాబు అసంతృప్తి
- చక్కదిద్దే పనిలో అధినేత


తిరుపతి, ఆంధ్రజ్యోతి

గత ఐదేళ్లూ ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా వైసీపీ నేతలను మొక్కవోని స్థైర్యంతో ఎదుర్కొన్న టీడీపీ శ్రేణులు ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావడంతో పెద్ద ఎత్తున సంబరపడ్డాయి. అయితే వంద రోజులు కూడా గడవకమునుపే శ్రేణులు నిరుత్సాహానికి లోనయ్యాయి. పలువురు ఎమ్మెల్యేలు ప్రభుత్వం వచ్చీరాగానే సంపాదనపై దృష్టి మళ్ళించారని, పార్టీ పటిష్టతను వదిలేసి దానికే తొలి ప్రాధాన్యత ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. నిఘా వర్గాలతో పాటు పార్టీ పరంగానూ వేర్వేరు మార్గాల్లో అందిన సమాచారం ఆధారంగా జిల్లాలో ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, ఇంచార్జుల పనితీరును, వారి వ్యవహార శైలిని అధినేత చంద్రబాబు బేరీజు వేస్తున్నట్టు సమాచారం. ఎక్కువ మంది ఎమ్మెల్యేలు పార్టీకోసం కష్టపడిన నాయకులను పట్టించుకోకుండా, తమకు అనుకూలురైన ఒకరిద్దరికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారని, వారు చెప్పినట్టే వినాలని మండల స్థాయిలో అధికారులకు ఆదేశాలిస్తున్నారని అధినేతకు ఫిర్యాదులు అందాయి. ఇక శాసనసభలో ప్రమాణస్వీకారం చేసిన వెంటనే కొందరు ఎమ్మెల్యేలు ఇసుక మీద పడ్డారు. ప్రభుత్వ ఇసుక విధానం ఖరారు కాకముందే డంపుల్లో నిల్వవున్న ఇసుకను దౌర్జన్యంగా తెగనమ్మేసుకున్నారని అంటున్నారు. రెండు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు. వైసీపీ నేతలు చేసిన భూ కబ్జా వ్యవహారాల్లో తలదూర్చి ఫిఫ్టీ: ఫిఫ్టీ పద్ధతిలో సర్దుడు బేరాలు మొదలు పెట్టేశారనే ఆరోపణలు ఉన్నాయి. తనకందుతున్న ఫీడ్‌బ్యాక్‌ను పరిగణనలోకి తీసుకుంటున్న అధినేత ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు, ఇంచార్జుల పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది. శ్రేణులను విస్మరించడాన్ని ఆయన తీవ్రంగా పరిగణిస్తున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ ఎమ్మెల్యేలు లేని మూడు నియోజకవర్గాలకు గానూ రెండు చోట్ల ఇంఛార్జుల పనితీరుపై కూడా అధినేత అసహనంగా వున్నట్టు ఆ వర్గాలు చెబుతున్నాయి. ఓ నియోజకవర్గంలో ఇంచార్జి పార్టీని గాలికొదిలేసినట్టు వ్యవహరిస్తుండడం, మరో చోట క్యాడర్ వాహనాల్లో అమరావతికి తరలివెళ్ళి ఇంఛార్జిపై ఫిర్యాదులు చేస్తుండడం పట్ల చంద్రబాబు సీరియస్‌గా వున్నట్టు సమాచారం.

సమన్వయపరిచే నాయకత్వంపై దృష్టి

ఉమ్మడి జిల్లాకు సంబంధించి పార్టీ పార్లమెంటు కమిటీల పేరిట మూడు ముక్కలైన సంగతి తెలిసిందే. అందులో రెండు కమిటీలకు సంబంధించి సమర్థ నాయకత్వం లేదని అధినేత భావిస్తున్నట్టు పార్టీ వర్గాల కథనం. కనీసం జిల్లా స్థాయిలో అభివృద్ధి ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళేందుకు, నిధుల కోసం ప్రయత్నించేందుకు కూడా తగిన నాయకత్వం లేకపోవడాన్ని అధినేత గ్రహించినట్టు చెబుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచీ ఎవరికీ మంత్రి పదవి కేటాయించకపోవడం కూడా ఈ పరిస్థితికి కారణం అంటున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పార్టీ వ్యవహారాలను చక్కదిద్దాల్సిన సీనియర్ నేతలు ఎవరి కారణాలతో వారు అసంతృప్తితో మిన్నకుండిపోయినట్టు అధినేత గుర్తించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వారిని చురుగ్గా పనిచేయించే దిశగా అధినేత దృష్టిసారించినట్టు తెలిసింది. అందులో భాగంగా ఇటీవల తిరుమలకు వచ్చిన చంద్రబాబు మాజీ మంత్రి అమరనాధరెడ్డితో ప్రత్యేకంగా మాట్లాడినట్టు సమాచారం. జిల్లా అభివృద్ధి ప్రతిపాదనలతో పాటు పార్టీ పరంగానూ చర్చించినట్టు తెలిసింది. మరింత లోతుగా చర్చించేందుకు, అవసరమైన నిర్ణయాలు తీసుకునేందుకు గానూ అమరనాధరెడ్డిని విజయవాడ వచ్చి తనను కలవాల్సిందిగా అధినేత సూచించినట్టు సమాచారం. దీంతో ఆయనకు ఉమ్మడి జిల్లా పార్టీ పర్యవేక్షణ బాధ్యతలు అప్పగిస్తారా లేక ఆయనతో పాటు మరికొందరు సీనియర్, ముఖ్యనేతలను కూడా పిలిపించి ఉమ్మడిగా బాధ్యతలు అప్పజెబుతారా అన్న ఊహాగానాలు పార్టీ శ్రేణుల్లో వెలువడుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై మంత్రి వర్గంలో చోటు లభించకపోవడంతో పలమనేరు నియోజకవర్గానికే పరిమితమైన అమరనాధరెడ్డి అధినేతను ఇంతవరకూ ఒంటరిగా కలసి మాట్లాడలేదు. ఈ నేపథ్యంలో చంద్రబాబు, అమర్‌నాథరెడ్డిల మధ్య జరిగిన సంభాషణ రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది. మొత్తం మీద అధినేత దృష్టి సారించడంతో ఉమ్మడి జిల్లాలో పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులకు, కార్యకర్తలకు మేలు జరుగుతుందన్న ఆశాభావం మాత్రం ఆ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

స్వర్ణముఖికి పెనుముప్పు



దొరువుకట్ట వద్ద గండిపడ్డ పొర్లుకట్ట

- దెబ్బతిన్న పొర్లుకట్ట.. ప్రమాదం జరిగితే నాలుగు గ్రామాలు గల్లంతే

కోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖి పొర్లుకట్టలను నిర్లక్ష్యంగా వదిలేయడంతో పెనుముప్పుగా మారింది. కోట మండలం దొరువుకట్ట, పుచ్చలపల్లి గ్రామాల సమీపంలో స్వర్ణముఖి పొర్లుకట్టలు దెబ్బతిన్నాయి. గతేడాది మీచౌంగ్ తుఫాన్ కారణంగా స్వర్ణముఖి నది వరదనీరు ఉగ్రరూపం దాల్చడంతో కుడి, ఎడమ పొర్లుకట్టలు కోతకు గురవడంతో పాటు అక్కడక్కడ గండ్లుపడ్డాయి. అయినా, అప్పటి వైసీపీ ప్రభుత్వం ఎలాంటి మరమ్మతులు చేయలేదు. తాత్కాలికంగా పనులు చేపట్టడానికీ చొరవ చూపలేదు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి నదిలోకి పూర్తిస్థాయిలో వరదనీరు వస్తే.. దెబ్బతిన్న పొర్లుకట్టకు పెనుముప్పు వాటిల్లే అవకాశం ఉంది. కోతకు గురైన, గండ్లుపడ్డ పొర్లుకట్టలు తెగితే అల్లంపాడు, దైవాలదిబ్బ, దొరువుకట్ట, పుచ్చలపల్లి గ్రామాలు గల్లంతయ్యే ప్రమాదం ఉంది. దీంతో స్థానికంగా ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



పుచ్చలపల్లి వద్ద కోతకుగురైన స్వర్ణముఖి పొర్లుకట్ట

వర్షాలకు పంటను కాపాడుకోండిలా..



బంతిపూలతోటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి శైలజ

ప్రస్తుత వర్షాలకు రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే నష్టం వాటిల్లదంటున్నారు మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్, ఉద్యాన అధికారి శైలజ. ఈమేరకు రైతులకు కొన్ని సూచనలు చేశారు.

- చంద్రగిరి, ఆంధ్రజ్యోతి

వరి: మొదటి, రెండో దశల్లో వర్షపు నీరు నిల్వ ఉంటే కాలువ ద్వారా బయటకు పారించాలి. కోత దశలో ఎక్కువ రోజులు పంట నీటిలో ఉంటే విత్తనాలు మొలకెత్తే అవకాశం ఉంది. దీని నివారణకు ఉప్పు ద్రావణం పిచికారి చేయాలి. వర్షంతో దెబ్బతిన్న పంట త్వరగా కోలుకోవాలంటే అదనంగా నత్రజని సంబంధిత ఎరువులను పిచికారి చేయాలి.

పూలతోటలు: మొక్కలపై 13:0:45 (నీటిలో కరిగే ఎరువు మల్టికే)ను గ్రాము, లేదా 2 గ్రాముల యూరియాను లీటరు నీటికి కలిపి 2, 3 సార్లు వారం రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. కోతకు సిద్ధంగా ఉన్న పువ్వులను వీలైనంత త్వరగా కోసుకోవాలి. ఆకుమచ్చ తెలుగు నివారణకు ప్రోపికొనజోల్ 1 మిల్లీ లేదా, అజాక్సీస్ట్రోబిన్ మిల్లీగ్రాములను లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. తోటల్లో నిలువ ఉన్న అదనపు నీటిని పొలం చుట్టూ కాలువలు తీసి బయటకు పంపాలి. మొక్కలు బలంగా పెరగడానికి పోషకాలు అందించాలి. లేత తోటల్లో చనిపోయిన మొక్కలను తీసి తిరిగి నాటుకోవాలి.

ఉద్యాన పంటలు: వర్షాల వల్ల బంక నేలలో నీరు నిలిచిపోతుంది. నీరు ఎక్కువ నిల్వ లేకుండా వెంటనే బయటకు పంపించే మార్గం చూడాలి. భారీ వర్షాలకు 33 శాతం పైన నష్టం వాటిల్లితే కూరగాయలు, పూలతోటలకు 2.50 ఎకరాకు రూ.17వేలు నష్ట పరిహారం ప్రభుత్వం చెల్లిస్తుంది. మామిడి తోటలకు రెండున్నర ఎకరాలకు రూ.22500 చెల్లిస్తుంది.

కూరగాయల తోటలు: వర్షానికి పడిపోయిన మొక్కలను నిలబెట్టి మొదలు దగ్గర మట్టిని ఎగదోయాలి. మొక్క పెరుగుదల దశలో ఉంటే 13:0:45 (నీటిలో కరిగే మల్టికే) 2 గ్రాములు లేదా 2 గ్రాముల యూరియా ద్రావణాన్ని 2, 3 సార్లు మొక్క తడిసేలా వారం వ్యవధిలో పిచికారి చేయాలి. తెగుళ్ల ఉధృతి నేపథ్యంలో సాఫ్ 2.5 గ్రాములు, లేదా మాంకోజెబ్ 2.5 గ్రాములు, జిగురు 0.5 ఎంఎల్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. వేరుకుళ్లు ఆశించిన నేలల్లో కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బెండజిమ్ గ్రాము లీటరుకు కలిపిన ద్రావణాన్ని మొక్కల మొదళ్లలో పోయాలి.

వేరుశనగపంటలో జాగ్రత్తలిలా..

తిరుపతి రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల నేపథ్యంలో వేరుశనగ రైతులు నష్టనివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం శాస్త్రవేత్త డాక్టర్ జాన్ వివరించారు. వివిధ దశల్లో ఉన్న వేరుశనగ పంటను కాపాడుకోవడంపై సూచనలు చేశారు. ఆ ప్రకారం.. వేరుశనగ విత్తనం వేసి 2-3 రోజుల సమయంలో ఉన్నప్పుడు నీటమునిగితే మొలకశాతం తగ్గుతుంది. ఈ దశలో వీలైనంత తొందరగా నీటిని బయటకు తీయాలి. ఈ దిశగా బోదెలు ఏర్పాటు చేసుకోవాలి. గింజ గట్టిపడే దశనుంచి చెట్టు పీకే వరకు.. నిద్రావస్థ కలిగిన రకాలలో పంటనష్టం తక్కువగా ఉంటుంది. నిద్రావస్థ లేనటువంటి రకాలు నీటమునిగితే గింజ మొలక వచ్చి ఎక్కువ నష్టాన్ని కలిగిస్తుంది చెట్టు పీకే దశలో ఉన్నట్లయితే చెట్ల మొదళ్లని నిటారుగా నిలబెట్టాలి. దీనివల్ల వర్షపునీరు కాయల మీద నిలబడదు. దీంతో కాయలోని గింజలు మొలకెత్తకుండా నివారించొచ్చు. పూర్తిగా ఆరని పంటని కుప్పలుగా వేసేటప్పుడు పీకిన వేరుశనగచెట్లపై టార్పాలిన్ పట్టలు కప్పుకోవాలి. కల్లాలపై ఉన్న నూర్పిడి చేసిన కాయలు వర్షానికి తడవకుండా చూసుకోవాలి.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

రోడ్డంతా గుంతలే..!



గుంతలమయంగా ఉన్న పాతసంత రోడ్డు

గూడూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతసంత రోడ్డు అడుగడునా గుంతలమయంగా మారడంతో ప్రయాణం నరకంగా మారింది. స్థానిక కోర్టు సెంటర్ సమీపంలో వెంకటగిరి - రాపూరు మార్గం నుంచి భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా పాతసంత రోడ్డు మీదుగా అంబేడ్కర్ నగర్ అండర్ బ్రిడ్జి ద్వారా నెల్లూరు - చెన్నై వైపునకు మినీ బైపాస్ ద్వారా వెళ్లేలా మళ్లించారు. గతంలో ఈ ప్రాంతంలో ప్రతి శుక్ర వారం గొర్రెలసంత నిర్వహించేవారు. భారీ వాహనాలు ఈ దారిలో మళ్లించడంతో గొర్రెలసంతను చిల్లకూరు మండలం ముత్యాలపాడుకు తరలించారు. భారీ వాహనాలు వెళ్లేలా పాతసంత రోడ్డు మార్గాన్ని ఆర్అండ్‌బీ అధికారులు అభివృద్ధి చేశారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం రోడ్ల అభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో ఈ మార్గంలో దుస్థితికి చేరుకుంది. రాళ్లుతేలి గుంతలమయంగా మారింది. దీంతో భారీ వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో దుమ్ములేచి సమీప నివాస గృహాల్లోకి చేరుతుండంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిసిన సమయంలో గుంతల్లో నీరు చేరడంతో లోతు తెలియక వాహనదారులు ప్రమాదాలకు లోనవుతున్నారు. అంతేకాకుండా ఈ రోడ్డుకు ఇరువైపులా కొబ్బరి బొండాలు, కోళ్ల వ్యర్థాలను వేస్తుండడంతో డపింగ్‌యార్డ్‌ను తలపిస్తూ దుర్వాసన వ్యాపిస్తోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పాతసంత రోడ్డును బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఈ దారిలో ప్రయాణమెలా?



బుదరమయంగా ఉన్న ప్రధాన రహదారి

నాయుడుపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున ఉన్న నాయుడుపేట-శ్రీకాళహస్తి రోడ్డు రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ ప్రాంతంలో గాంధీ మందిరం పార్కు, విద్యాలయాలు ఉండటంతో విద్యార్థులు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. అంతే కాకుండా ఈ రహదారి ద్వారా మేనకూరు సెజ్‌లోని పరిశ్రమలకు వెళ్లే వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి అడుగడుగునా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. గోమతి సర్కిల్ నుంచి కరెంట్ ఆఫీసు వరకు ఏపీఐఐసీ నిధులతో డబల్ లైన్ సిమెంటు రోడ్డు నిర్మించి, ఆపై వదిలివేశారు. అక్కడ నుంచి పార్కు వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. గుంతలు ఏర్పడి కొద్దిపాటి వర్షానికే నీరుచేరి రాకపోకలకు ఇబ్బందిగా ఉండడంతో పాదచారులు, వాహనదారులు అవస్థలు పడాల్సి వస్తుంది.

వివాహిత ఆత్మహత్యపై అధికారుల విచారణ



దందవోలు గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

డక్కిలి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని దందవోలు గ్రామానికి చెందిన ఏకోలు చెంచులక్ష్మి ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితుల గురించి నెల్లూరు జిల్లా ఐటీడీఏ పీవో పరిమల, తిరుపతి జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి సూర్యనారాయణ, డక్కిలి తహసీల్దార్ శ్రీనివాసులు మంగళవారం గ్రామంలో విచారించారు. మృతురాలి కుటుంబసభ్యులతో మాట్లాడారు. అనంతరం తహసీల్దారు శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ చెంచులక్ష్మి బంధువుల నుంచి స్టేట్‌మెంటు రికార్డు చేసినట్లు తెలిపారు. మృతురాలు గిరిజన కుటుంబానికి చెందిన మహిళ కావంతో ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని గిరిజన సంక్షేమ శాఖ అధికారులు చెప్పారు. కార్యక్రమంలో యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య, జిల్లా అధ్యక్షుడు తలపల చెంచుమల్లికార్జున రావు, మహిళా ఉపాధ్యక్షురాలు చెంబెటి ఉష, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇండ్ల మల్లికార్జున, జైభారత్ ఎస్సీ పోరాట వేదిక రాష్ట్ర కార్యదర్శి తలారి నాగరాజు, నవజీవన్ ఆర్గనైజింగ్ సభ్యుడు రమేష్ పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

గూడూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు చేపడుతామని డీఎస్పీ రమణకుమార్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైదాపురం గ్రామానికి చెందిన ఓ బాలుడు స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి తరువాత చదువు మానేసి పట్టణంలోని ఎస్‌కేఆర్ కళాశాల సమీపంలోని బంధువుల ఇంట్లో ఉంటున్నాడన్నారు. ఈ ఏడాది ఆగస్టు 20వ తేదీన బాలుడికి తిలక్‌నగర్‌కు చెందిన మరో బాలుడితో చిన్నపాటి వివాదం జరిగింది. గాంధీనగర్ సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద సైదాపురానికి చెందిన బాలుడిని తిలక్‌నగర్‌కు చెందిన బాలుడుతోపాటు అతని స్నేహితులు కొందరు మాట్లాడాలని పిలిచి నిర్బంధించి దాడి చేశారని తెలిపారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించడంతో ఫిర్యాదు ఇచ్చేందుకు బాధితుడు భయపడ్డాడని, అయితే మంగళవారం రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. దీనిపై విచారణ చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు శేఖర్‌బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముంపునకు గురికాకుండా చర్యలు

నాయుడుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా ఆధ్వర్యంలో ప్రధాన డ్రైనేజీల పూడికతీత తీయించే పనులు చేపట్టారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు తుమ్మూరు, రాజీవ్‌గాంధీకాలనీ, ఎల్‌ఏసాగరం, బీడీకాలనీ తదితర ప్రాంతాలు నీటమునిగాయి. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్తగా ఆయా ప్రాంతాల్లోని ప్రధాన డ్రైనేజీలలో ఎక్స్‌కవేటర్‌తో పూడికతీత పనులు చేపట్టారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

సూళ్లూరుపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో సూళ్లూరుపేట డివిజన్‌లో మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆర్డీవో కిరణ్మయి ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తడ, సూళ్లూరుపేట మండలాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సూళ్లూరుపేట ప్రాంతంపై తుఫాన్ అధిక ప్రభావం చూపే అవకాశం ఉందని, ఎటువంటి విపత్తు జరిగినా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. కార్యక్రమంలో నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, తడ, సూళ్లూరుపేట తహసీల్దార్లు, శరత్‌బాబు, నరసింహరావు, సీఐ మురళీకృష్ణ, ఎంపీడీవో ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులు వేటకు వెళ్లవద్దు: ఆర్డీవో



భీములవారిపాళెంవాసులతో మాట్లాడుతున్న ఆర్డీవో

తడ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు అధికారులంతా సిద్ధంగా ఉన్నామని సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి తెలిపారు. మంగళవారం భీములవారిపాళెం పడవలరేవుకు వచ్చిన ఆమె అక్కడ పరిస్థితులను పరిశీలించారు. వేటకు వెళ్లవద్దంటూ మత్స్యకారులకు సూచించారు. అత్యవసర పరిస్థితులు ఉంటే తప్ప బయటకురావద్దని ఇరకందీవి గ్రామస్తులను అప్రమత్తం చేశారు. నిత్యావసర సామగ్రి, గజ ఈతగాళ్లు, పడవలు అందుబాటులో ఉంచామని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలిస్తామని చెప్పారు. ఆర్డీవో వెంట తహసీల్దారు శరత్‌బాబు, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎస్ఐ కొండపనాయుడు తదితరులు ఉన్నారు.

కుండపోత వర్షం

గూడూరు/పెళ్లకూరు/సూళ్లూరుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మంగళవారం గూడూరు పట్టణంలో కుండపోత వర్షం కురిసింది. ఉదయం వర్షం కురిసినా సాయంత్రం వరకు తెరపిచ్చి ఆకాశం మేఘావృతంగా మారింది. సాయంత్రం 6గంటల నుంచి రాత్రి వరకు కండపోత వర్షం కురిసింది. వర్షం కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై వర్షపునీరు ప్రవహిస్తుండడంతో పాదచారులు, ద్విచక్రవాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడాల్సివచ్చింది. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి తీరప్రాంతాల్లో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమీక్షిస్తున్నారు. ● పెళ్లకూరు మండలంలో కుండపోత వర్షం కురుస్తోంది. మంగళవారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేని వర్షం పడుతోంది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతూ చెరువులకు నీరు చేరుతుంది. మరో మూడు రోజులుగా వర్షాలు పడతాయని వాతావరణ శాఖ ప్రకటించడం.. ఉరుములు, మెరుపులు ఎక్కువగా ఉండడంతో వర్షం తగ్గుముఖం పట్టే వరకు ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి సూచించారు.



పెళ్లకూరులో జలమయమైన రోడ్డు



సూళ్లూరుపేటలో వర్షం

సూళ్లూరుపేటలో 66.6 మి.మీ. వర్షపాతం

సూళ్లూరుపేటలో సోమవారం అర్ధరాత్రి నుంచి మొదలైన వాన మంగళవారం ఉదయం 10 గంటల వరకు తెడతెరిపి లేకుండా కురిసింది. మళ్లీ మధ్నాహ్నం 3 గంటల నుంచి ఉరుములతో కూడిన వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. 66.2 మి.మీ. వర్షపాతం నమోదయ్యింది. వర్షంతో పాటు చలి తీవ్రత అధికంగా ఉండడంతో పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. తేలికపాటి గాలులతో పాటు ఉరుములు తోడవ్వడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. బాపూజీ వీధి, జీఎన్‌టీ రోడ్డు, సాయిగనర్, సూళ్లూరు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ఎస్పీడీసీఎల్ అధికారులు వెంటనే స్పందించి పునరుద్ధరణకు పనులు చేపడుతున్నారు. ఇప్పటి వరకు ఎటువంటి నష్టం జరగకపోయిన మరో రెండు రోజులు తుఫాన్ ప్రభావం ఉండడంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

కాకుల సరదా... కరెంటోళ్లకు కష్టం

● మాడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల ఫీజులు
● ఇళ్లలో కాలిపోయిన మీటర్లు, గృహోపకరణాలు

తడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రెండు కాకుల సరదా కరెంటోళ్లకు కష్టం తెచ్చిపెడితే... కొన్ని ఇళ్లల్లో విద్యుత్ మీటర్లు, గృహోపకరణాలు కాలిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో రాత్రంతా విద్యుత్ లేక జనం అవస్థలు పడ్డారు. సోమవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో తడ రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలోని సర్వీస్‌రోడ్డులో ఉన్న ట్రాన్స్‌పార్మర్ వద్ద రెండు తీగలపై రెండు కాకులు వాలాయి. అవి సరదాగా అటుఇటు కదుతుండగా రెండు కాకుల రెక్కలు కలుసుకోవడం ఒక్కసారిగా ట్రాన్స్‌పార్మర్‌లోని ఫీజులు పెద్ద శబ్దంతో తెగిపోయాయి. ఆ స్తంభాల నుంచి వెళ్తున్న 11 కేవీ లైన్ తెగిపోయి దాని కింద మరో లైన్‌పై పడింది. దీంతో ఆ చుట్టుపక్కల ఉన్న ఐదు ట్రాన్స్‌పార్మర్ల ఫీజు వైర్లు పెద్దశబ్దంతో ఒకేసారి కాలిపోయాయి. ఒక్కసారిగా హైవోల్టేజీ సరఫరా కావడంతో కొన్ని ఇళ్లకు ఉన్న విద్యుత్ మీటర్లు మలమలా మాడిపోగా, పలు ఇళ్లల్లో లైట్లు, టీవీలు, వాషింగ్ మిషన్ వంటి గృహోపకరణాలు కాలిపోయాయి. ఈ ప్రమాదంతో తడ సబ్ స్టేషన్‌లో ఫీజులూ దెబ్బతిన్నాయి. రెండు కాకుల సరదాతో ప్రమాదం సంభవించడంతో విద్యుత్‌శాఖ అధికారులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. మంగళవారం ఉదయం 11 గంటలకు మరమ్మతులు ముగించి పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించగలిగారు. రాత్రంతా రైల్వేస్టేషన్ రోడ్డులోని పలు గృహాలకు విద్యుత్ సరఫరా లేక జనం ఇబ్బంది పడటమే కాకుండా గృహోపకరణాలు కాలిపోవడంతో లబోదిబోమంటున్నారు. ఈ ప్రమాదంలో సుమారు 50 వరకు విద్యుత్ మీటర్లు కాలిపోయాయని, మరికొన్ని మీటర్లల్లో చిన్నపాటి సమస్యలు ఏర్పడ్డాయని ట్రాన్స్‌కో ఏఈ మురళి తెలిపారు.



కాలిపోయిన విద్యుత్ మీటరు - కాకులు వాలిన ట్రాన్స్‌ఫార్మర్ ఇదే

ప్రమాదకరంగా పాఠశాల భవనం

గుడిలో తరగతుల నిర్వహణ



పెచ్చులూడి పడుతున్న పాఠశాల పైకప్పు - వరండాలో వర్షపునీరు - గుడిలో తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు

పెళ్లకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాలకారికండ్రిగలో ప్రాథమిక పాఠశాల భవనం ప్రమాదకరంగా ఉంది. పాఠశాల భవనం పెచ్చులూడి పడుతుండడంతో గ్రామంలోని గుడిలో మంగళవారం తరగతులు నిర్వహించారు. మండల కేంద్రమైన పెళ్లకూరుకు సుమారు 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతపూడి పంచాయతీ పరిధిలో యాలకారికండ్రిగ గ్రామం, గంగరాజుకండ్రిగ దళితవాడ ఉన్నాయి. ఈ రెండు గ్రామాలకు యాలకారికండ్రిగలో ప్రాథమిక పాఠశాల ఉంది. సుమారు 35 ఏళ్ల క్రితం నిర్మించిన పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో భవనం శ్లాబు పెచ్చులూడి పడుతోంది. ఇది చూసి భయాందోళన చెందిన కొందరు తమ పిల్లలను ఇతర ప్రాంతాల్లోని ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారు. ప్రస్తుతం కేవలం పది మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. సోమవారం నుంచి కురుస్తున్న వర్షాలకు పాఠశాల భవనం ఉరుస్తూ పైనుంచి పెచ్చులూడి పడుతుండడంతో మంగళవారం ఏడుగురు విద్యార్థులు పాఠశాలకు రాలేదు. హాజరైన ముగ్గురు విద్యార్థులకు గ్రామంలో ఉన్న శ్రీరాముడి ఆలయంలో తరగతులు నిర్వహించారు. శిథిలావస్థకు చేరిన పాఠశాల గురించి పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని, ప్రభుత్వం స్పందించి నూతన భవనం నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధికే పల్లెపండుగ



అలిమిలిలో శంకుస్థాపన చేస్తున్న అధికారులు

బాలాయపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కోసమే పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వినీల్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని అలిమిలిలో రూ.10లక్షలు, మన్నూరులో రూ.10 లక్షలు, పల్లిపాడులో రూ.8 లక్షలు, గొట్టికాడులో రూ.8 లక్షలతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ మోహన్‌రాజు, ఏపీవో మృత్యుంజయరావు, నాయకులు రాయి సత్యంనాయుడు, రఘురెడ్డి, పగడాల వెంకటరమణ, బద్దెవోలు కల్యాణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు హెచ్చరిక

కోట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కోటలోని ఓ ప్రైవేటు పాఠశాలకు మంగళవారం అధికారులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టర్ వెంకటేశ్వర్ అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు కళాశాలలకు మంగళవారం కూడా సెలవు ఇచ్చినప్పటికి ఒక పాఠశాలలో తరగతులు నిర్వహించారు. ఈ విషయం తెలియడంతో తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో వేణు, ఎంఈవో మస్తానయ్య పాఠశాలను సందర్శించి తరగతులు నిర్వహించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటన మరొక్కసారి జరిగితే పాఠశాల అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

భయం గుప్పెట్లో ఉన్నాం... ఆదుకోండయ్యా



గంగిటివానిదిబ్బలో గ్రామస్తులతో అధికారులు

కోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నడూ లేని విధంగా బకింగ్‌హాం కెనాల్‌కు వరదనీరు పోటెత్తుతోందిన, ఏ క్షణంలో అయినా కెనాల్ నీరు గ్రామాన్ని ముంచెత్తే అవకాశం ఉండడంతో తమను ఆదుకోవాలంటూ మంగళవారం సిద్ధవరం పంచాయతీలోని గంగిటివానిదిబ్బ గ్రామస్తులు అధికారులను వేడుకున్నారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు కాకినాడ నుంచి చెన్నై వెళ్లే బకింగ్‌హాం కెనాల్ గంగిటివాని దిబ్బమీదుగా గోవింద పల్లిపాళెం సముద్రంలో కలుస్తుంది. కెనాల్‌కు వరదపోటు రావడం ఏక్షణంలో అయినా తెగిపోతే గ్రామంలోకి నీరు చేరి 30 కుటుంబాలు గల్లంతయ్యే అవకాశం ఉందని రెండు రోజులక్రితం స్థానికులు కలెక్టర్‌ను ప్రాధేయపడ్డారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దారు జయజయరావు, పలు శాఖల అధికారులు గంగిటివానిదిబ్బ గ్రామం, బకింగ్‌హాం కెనాల్‌ను పరిశీలించారు. ఇబ్బంది ఎదురైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్నామని గ్రామస్తులకు అధికారులు భరోసా ఇచ్చారు.

కలాంను యువత ఆదర్శంగా తీసుకోవాలి

గూడూరు అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్‌కలాంను యువత ఆదర్శంగా తీసుకోవాలని డీఆర్‌డబ్ల్యు కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు అన్నారు. మంగళవారం కళాశాలలో అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అబ్దుల్‌కలాం దేశానికి ఎనలేని సేవలు అందించారన్నారు. ఆయన సూచించిన మార్గంలో విద్యార్థులు నడుస్తూ శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో అబ్దుల్‌కలాం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు తాజుద్దీన్, మయూరి శ్యామ్‌యదవ్, సునీత, విద్యార్థినులు పాల్గొన్నారు.

తీరప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి



ఉప్పుటేరు నీటి మట్టాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు శ్రీనివాసులు

చిల్లకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు శ్రీనివాసు అన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని సూచించారు. తమ్మనపట్నం, గోనుంటపాళెం, తిప్పగుంటపాళెం గ్రామాలను సందర్శించారు. గోనుగుంటపాళెం లోతట్టు ప్రాంతమైన గిరిజన కాలనీలోని వర్షపునీరు నిల్వ చేరకుండా సమీపంలోని బకింగ్‌హాం కెనాల్‌లోకి యంత్రాల సాయంతో కాలువ తీసి నీటిని మళ్లించే చర్యలు చేపట్టారు. తమ్మినపట్నంలో మత్స్యకారులకు వేటకు వెళ్లరాదని సూచించారు. తిప్పగుంటపాళెం సమీపంలోని ఉప్పుటేరు నీటి మట్టాన్ని పరిశీలించి గ్రామస్తులకు అప్రమత్తం చేశారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది, టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు ఉన్నారు.

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

గూడూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా ఎటువంటి నష్టం జరగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా సైక్లోన్ నోడల్ అధికారి ఆదిశేషయ్య అన్నారు. మంగళవారం స్థానిక గోగినేనిపురంలోని విద్యుత్ కార్యాలయంలో ఈఈ నరేంద్రరెడ్డితో సమీక్ష నిర్వహించారు. తుఫాన్ కారణంగా ఎటువంటి విపత్తులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విద్యుత్ స్తంభాలను, తీగలను సెక్షన్ ఆఫీసులో సిద్ధంగా ఉంచుకుని, అవసరమైన చోట పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా స్థానిక చిల్లకూరు సబ్‌స్టేషన్‌లో సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు అందజేశారు.

వీఆర్వోలు గ్రామాల్లోనే ఉండాలి

ఓజిలి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తుపాను హెచ్చరికల నేపథ్యంలో వీఆర్వోలంతా తమకు కేటాయించిన గ్రామాలలో అప్రమత్తంగా ఉండాలని ఓజిలి మండల తహసీల్దారు పద్మావతి మంగళవారం తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ వరకు భారీ వర్ష సూచనలు ఉన్న కారణంగా ఈ హెచ్చరికలు చేశారు. ఎప్పటికప్పుడు గ్రామాలలో పరిస్థితులను మండల కేంద్రానికి తెలియజేయాలని ఆమె సూచించారు. భారీవర్షం ముంపునకు గురయ్యే ప్రాంతాలలో ముందస్తు చర్యలతో సిద్ధంగా ఉండాలని తహసీల్దారు తెలిపారు. ఈసందర్భంగా మండల డిప్యూటీ తహసీల్దారు మధుసూధనరాజు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: విజయశ్రీ



వట్రపాలెంవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం రాత్రి ఆమె అధికారులు, టీడీపీ నాయకులతో కలిసి లోతట్టు ప్రాంతమైన వట్రపాలెంలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. మరో రెండు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. ఏ సమస్య వచ్చిన వెంటనే అధికారుల దృష్టికి తేవాలన్నారు. మరో రెండు అత్యవసరమైతే తప్ప బయటకు రాకుండా ఇళ్లలోనే ఉండాలన్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, తహసీల్దార్ నరసింహరావు, టీడీపీ నాయకులు టి.సుధాకర్ రెడ్డి, ఏజీ కిషోర్, రమణయ్య, ఆలీభాయ్, శివ తదితరులు ఉన్నారు.

అంధులకు జాతీయస్థాయి క్రీడా పోటీలు

వెంకటగిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గరుజరాత్ వేదికగా ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు అంధులకు జాతీయస్థాయి క్రీడా పోటీలను తొలిసారి నిర్వహిస్తున్నట్లు అంధుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పచ్చూరి పెంచల నరసయ్య నాయుడు తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుంచి తొలిసారి అంధుల అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులు జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ పోటీలకు ఎంపికైన వారికి క్రీడా పరికరాలను అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వినయ్ కుమార్, సభ్యుడు రంగినేని రాజా అందజేశారు.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన అంధులు